ప్రజాశక్తి
శనివారం 27 డిసెంబర్ 2025
8 పేజీలు


ఎన్‌టిఆర్


కృష్ణా

తలసరి ఆదాయం, స్థూల ఉత్పత్తి పెంచండి

డిఆర్‌సిలో ఇన్ఛార్జి మంత్రి సత్యకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి - విజయవాడ : తలసరి ఆదాయం, జిల్లా స్థూల ఉత్పత్తిలో మెరుగుదల సాధించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్ఛార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధన దిశగా చేస్తున్న ప్రయాణంలో వివిధ శాఖలకు సంబంధించి 315 కీలక ప్రగతి సూచిక (కేపీఐ)ల్లో 83 స్కోరుతో ఎన్‌టిఆర్ జిల్లా రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా నిలిచిందన్నారు. విజయవాడలోని ఇరిగేషన్ కాంపౌండ్ రైతు శిక్షణ కేంద్రంలో 4వ జిల్లా సమీక్షా కమిటీ (డీఆర్‌సీ) సమావేశం మంత్రి సత్యకుమార్ అధ్యక్షతన జరిగింది. ఫ్రంట్ రన్నర్‌గా ఉన్న జిల్లా ఏ ప్లస్ అచీవర్ స్థాయికి చేరుకునేందుకు కషిచేయాలని ఆకాంక్షించారు. పాలనలోనూ, సేవల పంపిణీలోనూ స్పీడ్ ఆఫ్ డూయింగ్ స్ఫూర్తితో పనిచేయాలన్నారు. గత డీఆర్‌సీ సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన వివిధ అంశాలపై తీసుకున్న చర్యలపై చర్చించారు. పరిశ్రమలు, వైద్య ఆరోగ్యం, రహదారులు, వ్యవసాయ అనుబంధ రంగాలు, శాంతిభద్రతలు, పోలీస్ కమిషనరేట్ అమలుచేస్తున్న వినూత్న కార్యక్రమాలు, జీవో నెంబరు 30 అమలు, పీఎం సూర్యఘర్ తదితరాలపై సమావేశంలో చర్చించారు. రెవెన్యూ సేవలు, సమస్యల పరిష్కారానికి సంబంధించిన దరఖాస్తుల సత్వర పరిష్కారం, రహదారుల పనుల్లో వేగవంతం, విజయవాడ రూరల్ పరిధిలో సురక్షిత తాగునీరు, పారిశుధ్యం, సీజనల్ వ్యాధుల కట్టడి, ఎ.కొండూరు కిడ్నీ వ్యాధి బాధితులకు అందిస్తున్న సేవలు తదితరాలకు సంబంధించిన అంశాలను ప్రజాప్రతినిధులు సమావేశం దష్టికి తీసుకొచ్చారు. దీనిపై అధికారులు వివరణ ఇచ్చారు. ఆయా అంశాల కార్యాచరణకు మంత్రి పలు సూచనలు చేశారు. శాసనభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య).... రెవెన్యూ సేవల దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేకంగా దష్టిసారించాల్సిన అవసరముందన్నారు. సమావేశం అనంతరం మంత్రి సత్యకుమార్ మీడియాతో మాట్లాడుతూ గత సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన 61 అంశాలకు సంబంధించి 11 అంశాలు పరిష్కరించినట్లు చెప్పారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. టెండర్ల ప్రక్రియతోపాటు డీపీఆర్‌ల సత్వర రూపకల్పనపైనా దష్టిసారిస్తున్నట్లు తెలిపారు. 2023-24లో తలసరి ఆదాయం రూ.3,21,651 కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సర లక్ష్యం రూ.4,17,412 అని, ఇదేవిధంగా జిల్లా స్థూల ఉత్పత్తి (జీడీడీపీ) 2024-25లో రూ.94,561 కోట్లు కాగా 2025-26 లక్ష్యం రూ.1,12,148 కోట్లు అని అన్నారు. ఈ రెండు అంశాల్లోనూ ఎన్‌టిఆర్ జిల్లా లక్ష్యాలకు అనుగుణంగా ప్రగతి దిశగా పయనిస్తోందని వివరించారు. 2025-26కు సంబంధించి జిల్లాలో 1,600 ఎంఎస్‌ఎంఈ యూనిట్ల రిజిస్ట్రేషన్‌ను లక్ష్యంగా నిర్దేశించుకోగా, నవంబర్ 25 నాటికి 1,121 (70.06 శాతం) పూర్తయ్యాయన్నారు. ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నామని, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల నిర్మాణంతోపాటు డిజిటల్ రికార్డుల అనుసంధానంతో వ్యక్తి కేంద్రీకత ఆరోగ్య సేవల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పీఎం అభిమ్, ఆర్‌బీఎస్‌కే తదితరాల అమల్లోనూ ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ రాజరాజేశ్వరి పేటలో అతిసార కేసులు

(మిగతా 2లో)

డిఆర్‌సికి డుమ్మా !

- అత్యధిక మంది ప్రజాప్రతినిధులు గైర్హాజరు
- ప్రజా సమస్యలు పట్టని వైనం
- రెండు సార్లు వాయిదా వేసినా ప్రయోజనం శూన్యం

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌తోపాటు జిల్లాలోని ఆయా మునిసిపాలిటీలు, గ్రామాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రజలు కూడా అటు ప్రజాప్రతినిధులకు, ఇటు అధికారులకు పలు సందర్భాల్లో వినతిపత్రాల రూపంలో విన్నవించిన పరిస్థితి ఉంది. ఇటువంటి నేపథ్యంలో...ప్రజల సమస్యలను ఆయాశాఖల అధికారుల దృష్టికి తీసుకురావడంతో పాటు సమగ్రమైన చర్చ జరగడానికి వేదికగా ఉండే... డిఆర్‌సి సమావేశానికి పలువురు ప్రజాప్రతినిధులు గైర్హాజరయ్యారు. వీరి తీరు పట్ల ప్రజల్లో తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ అధ్యక్షతన విజయవాడలో శుక్రవారం 4వ జిల్లా సమీక్షా కమిటీ (డిఆర్‌సి) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశ, ఎమ్మెల్యేలు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, యార్లగడ్డ వెంకట్రావు, వైసిపి ఎమ్మెల్సీలు మొండితోక అరుణ్‌కుమార్, రుహుల్లా, జె.సి ఇలక్కియ, విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర మాత్రమే హాజరయ్యారు. రెండు సార్లు వాయిదా పడిన ఈ సమావేశాన్ని ప్రజాప్రతినిధులు రావడం లేదనే ఉద్దేశంతో మూడోసారి మళ్లీ వాయిదా వేస్తే బాగుండదనే ఉద్దేశంతో సమావేశాన్ని నిర్వహించినట్లు సమాచారం. ప్రజాప్రతినిధుల గైర్హాజరుపై మీడియా సమావేశం సందర్భంగా విలేకరులడిగిన ఒక ప్రశ్నకు పై విధంగా మంత్రి సమాధానమివ్వడం గమనార్హం. ప్రస్తుతం జరిగిన ఈ సమావేశానికి విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్‌తోపాటు జిల్లాలోని మిగిలిన ప్రజాప్రతినిధులందరూ డుమ్మా కొట్టారు. ఎన్‌టిఆర్ జిల్లా పరిధిలో ఎంపితోపాటు ఏడుగురు ఎమ్మెల్యేలకు గాను ఈ సమావేశానికి కేవలం ఒక ఎమ్మెల్యే మాత్రమే హాజరయ్యారు. పక్క జిల్లా అయినా కానీ పాలనాపరంగా మన జిల్లా పరిధిలో పలు గ్రామాలున్నందున గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హాజరయ్యారు. అయితే విజయవాడ నగరం కేంద్రంగా ఉండే ఎంపి కేశినేనితోపాటు ముగ్గురు ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామమోహన్‌రావుతోపాటు రూరల్ పరిధిలోని మిగిలిన ముగ్గురు ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, కొలికపూడి శ్రీనివాసరావు, తంగిరాల సౌమ్య గైర్హాజరవ్వడం గమనార్హం. విజయవాడ సిటీతోపాటు జిల్లా వ్యాప్తంగా అనేక సమస్యలు దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోకుండా ఎదురు చూస్తూనే ఉన్నాయి. విజయవాడ సిటీలో ప్రధానంగా డ్రెయినేజి సమస్య ఏళ్ల తరబడి వెంటాడుతూనే ఉంది. చినుకు పడితే చిత్తడే అన్న చందంగా తయారయింది. ఎంతో ప్రాధాన్యత కల్గిన రూ.461 కోట్ల స్ట్రామ్ వాటర్ డ్రెయినేజి స్కీమ్ అర్ధాంతరంగా మధ్యలోనే ఆగిపోయింది. ఈ స్కీమ్‌కు సంబంధించి రూ.289 కోట్లు ప్రభుత్వం వద్దనే ఉన్నా...నేటికీ ఆ నిధుల పరిస్థితిపై ప్రజాప్రతినిధుల్లో, అధికారుల్లో ఒక స్పష్టత లేకపోవడం గమనార్హం. అలాగే విఎంసి నిధులు సమస్య వెంటాడుతూనే ఉంది. వందల కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివిధ రూపాల్లో విఎంసికి జమ కావాల్సి ఉంది. అయినా నేటికీ ఒక్క రూపాయి కూడా జమ

(మిగతా 2లో)


సిఎం చంద్రబాబును కలిసిన వీరంకి వెంకట గురుమూర్తి

అధిష్టానం ఆదేశాలే శిరోధార్యం

టిడిపి కృష్ణాజిల్లా అధ్యక్షుడు వీరంకి సిఎంను కలిసి కృతజ్ఞతలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో : టిడిపిలో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన తనకు పార్టీ అధిష్టానం సముచిత స్థానం కల్పించిందని టిడిపి కృష్ణాజిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా గురుమూర్తి తన సతీమణి విజయలక్ష్మి, కుమారుడు పవన్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబును తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడుతూ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయనని, బాధ్యతగా తన విధులు నిర్వర్తించి జిల్లాలో తెలుగుదేశం పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు.

మోసం తట్టుకోలేకే రైతు దొండపాటి మృతి : వైసిపి


ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అమరావతి రైతుల్ని కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేస్తోందని, పట్టా భూములు తీసుకుని చెరువులు, వాగులు ప్రవహించే మార్గాల్లో రిటర్నబుల్ ప్లాట్లు కేటాయిస్తోందని వైసిపి తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి జిల్లా కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాజధాని రైతులకు చెరువులు, వాగుల్లో ప్లాట్లు కేటాయించడం వల్ల వారు తీవ్ర మనోవేదనలో ఉన్నారని చెప్పారు. ఆ ఆవేదనతోనే రైతు దొండపాటి రామారావు గుండెపోటుకు గురై మందడం సభలో చనిపోయారని స్పష్టం చేశారు. ఎన్-8 రోడ్డు నిర్మాణానికి ఇచ్చిన భూమికి ప్రత్యామ్నాయంగా ముంపు ప్రాంతంలో ప్లాట్ కేటాయించడాన్ని తట్టుకోలేకపోయిన రైతు రామారావు.... మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యే శ్రవణ్ కుమార్ ముందు తన గోడు వెళ్లబోసుకున్నా ఫలితం దక్కలేదన్నారు. ఆ ఆవేదనలో ప్రాణాలు కోల్పోయారని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రైతులకు ప్రభుత్వం చేస్తున్న మోసంపై ప్రశ్నిస్తే అభివృద్ధిని అడ్డుకుంటున్నారని తమపై నిందలు వేస్తున్నారని విమర్శించారు. రైతులకు మద్దతుగా వారి తరపున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. దొండపాటు, పిచ్చుకలపాలెంలో చెరువుల్లో రైతులకు ప్లాట్లు ఇచ్చారని, దీంతో మనోవేదనతో ఉన్నారని, కొంత మంది తమ బాధను ఎవరికి చెప్పుకోలేక కుమిలిపోతున్నారని తెలిపారు.

ప్రణాళికతో ముందుకు సాగితే ఉన్నత భవిష్యత్తు

ఎన్‌టిఆర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ భువనేశ్వరి

ప్రజాశక్తి - పామర్రు : భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు విద్యార్థి దశ నుండే ప్రణాళికతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ నారా భువనేశ్వరి అన్నారు. శుక్రవారం ఆమె తన స్వగ్రామమైన కృష్ణాజిల్లా పామర్రు మండలం నిమ్మకూరులో ఉన్న గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థుల సమావేశంలో మాట్లాడారు. తన తండ్రి ఎన్టీఆర్ నిమ్మకూరులో చదువుకుంటూ వ్యవసాయ పనుల్లో తండ్రికి సహాయం చేస్తూ, పాలు అమ్ముకుంటూ కష్టపడి ఉన్నత స్థితికి వచ్చారని అన్నారు. తాను ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్‌పర్సన్‌గా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని, అందుకు ఎన్నో అవార్డులను అందుకున్నానని అన్నారు. చిన్ననాటి నుండి కష్టపడే తత్వం, క్రమశిక్షణ అలవర్చుకుంటే ఎవరైనా ఉన్నత స్థితికి చేరుకోవచ్చని అన్నారు. నేడు టెక్నాలజీ అభివద్ధి చెందిందని, దానిని దుర్వినియోగపరచకుండా అభివద్ధికి వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.3.5 కోట్ల నిధులతో నూతనంగా నిర్మించిన కళాశాల భవన శిలాఫలకాన్ని ఆమె ఆవిష్కరించారు. తొలుత గ్రామ ముఖద్వారం వద్ద మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ బాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనగళ్ళ నారాయణ, జిల్లా టిడిపి నూతన అధ్యక్షుడు రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ చైర్మన్ వేరంకి గురుమూర్తి, స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా తదితరులు గ్రామస్తులతో కలిసి ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని ఎన్టీఆర్ దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఆరోగ్య కేంద్రంలో రూ.6 కోట్ల నిధులతో చేపట్టిన అభివద్ధి పనులకు ఆమె భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్థానిక శివాలయంలో పూజలు నిర్వహించి అక్కడే ఉన్న సమావేశ మందిరంలో గ్రామస్తులతో కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఆర్థిక స్థితి సరిగా లేకపోయినా సిఎం చంద్రబాబు ఒక ప్రణాళికా బద్ధమైన పాలనతో ముందుకు వెళుతున్నారని, తన దష్టికి వచ్చిన సమస్యలను ఆయనకు వివరిస్తానని చెప్పారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, మార్కెట్ యార్డ్ చైర్మన్ జన్ను శోభన్ బాబు, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్, జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి పెద్ద రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నారా భువనేశ్వరి




ఐక్య పోరాటాలు అనివార్యం

విజయవాడ : అన్ని చట్టబద్ధ వ్యవస్థలనూ గుప్పిటబట్టి.. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఖాతరు చేయకుండా ప్రజల హక్కుల్ని కాలరాస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలను నిలువరించడానికి ఐక్య పోరాటాలు అనివార్యమని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. ప్రగతిశీల కార్మిక సమాఖ్య (పీకేఎస్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో "శ్రామిక నేస్తం" పత్రిక ఆవిష్కరణ సభ శుక్రవారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్ లో జరిగింది. ఎడిటర్ ఎ.అన్నపూర్ణ అధ్యక్షతన జరిగిన సభకు రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల నుండి పీకేఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్, రాష్ట్ర మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ప్రధానోపన్యాసం చేస్తూ– ఏటా వేలు, లక్షల కోట్ల రూపాయల నికర ఆదాయం పొందుతున్న బడా కార్పొరేట్ సంస్థలకు దాదాపు ఉచితంగా భూములు, కారుచౌకగా ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం– కొద్ది మొత్తంలో పూర్తయ్యే ప్రభుత్వ వైద్య కళాశాలను.. నిధుల్లేవనే సాకుతో ప్రైవేట్ వారికి అప్పగించబూనడం పాశవికమని నిరసించారు.

అదానీ, అంబానీలకు లబ్ధి చేకూర్చడానికే మోడీ ప్రభుత్వం– సుప్రీంకోర్టు తీర్పుల స్ఫూర్తిని.. అన్ని రాజ్యాంగ ప్రజాస్వామ్య, వ్యవస్థలను తోసి రాజంటోందని గర్హించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఏ నరసింహారెడ్డి, పీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే మస్తాన్, తెలంగాణ అసంఘటిత కార్మిక సంఘాల సమాఖ్య అధ్యక్షుడు చిర్రా రవి తదితరులు ప్రసంగించారు. పీకేఎస్ ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి సమన్వయ పరిచిన ఈ కార్యక్రమంలో మాచర్ల మోహనరావు (చేనేత జన సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు), కె.కృష్ణ (కెఎన్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి), అరసవిల్లి కృష్ణ (విరసం), మంజరి లక్ష్మి (సిఎంఎస్), డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్ (భారత్ బచావో), ఊటుకూరు వెంకటేశ్వరరావు (బీసీ ఫెడరేషన్), టి.ఆంజనేయులు (పౌర హక్కుల సంఘం), పి.శ్రీనివాస్ (ప్రజా కళామండలి) తదితరులు సందేశాలు ఇచ్చారు. పీకేఎస్ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి పి.దుర్యోధనుడు తొలుత స్వాగతం పలికి వక్తలను వేదికపైకి ఆహ్వానించారు. పీకేఎస్, పీకేఎం కళాకారులు పలు అభ్యుదయ, విప్లవ గేయాలు పాడి సభికుల్ని అలరించారు.



ఘనంగా సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలు

ప్రజాశక్తి - విజయవాడ : సిపిఐ శతాబ్ది ముగింపు వేడుకలు శుక్రవారం విజయవాడలో ఘనంగా జరిగాయి. నగరంలోని జింఖాన గ్రౌండ్ నుండి 150 అడుగులు ఎర్రజెండా చేతపట్టుకుని కొమ్ము డ్యాన్స్, తీన్మార్, డప్పు వాయిద్యాలు, థింసా, కోలాట కార్యక్రమాలతో భారీ ప్రదర్శన లెనిన్ సెంటర్ వరకు సాగింది. అనంతరం లెనిన్ విగ్రహం ప్రాంగణం వద్ద పార్టీ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన భారీ బహిరంగ సభలో పార్టీ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ బల్లి విల్సన్, జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, నగర నాయకులు లంకా దుర్గారావు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, ఎఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్. ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాసర్ జీ, వలరాజు, ఎపిఎన్ఎం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్, డీహెచ్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, పార్టీ విజయవాడ నగర సహాయ కార్యదర్శులు నక్కా వీరభద్రరావు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న 'ఫ్రెండ్స్ అడ్డా..' కచేరీ

విజయవాడ : క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలతో "ఫ్రెండ్స్ అడ్డా... సీజన్– 2" సినీ సంగీత విభావరి గాంధీనగర్ ఆశీష్ స్టూడియోస్ లో శుక్రవారం జరిగింది. ట్రాక్స్ సమకూర్చిన గాయకుడు సూర్య నిర్వహణలో వినోద్, సుమ, మాలతి నాయుడు, లక్ష్మి, వెంకట్ తదితర గాయనీ గాయకులు పాడిన వివిధ పాటలు ప్రేక్షకుల్ని అలరించాయి.



మహానటి సావిత్రి వర్ధంతి

విజయవాడ : నటనకు నిలువెత్తు నిదర్శనం.. మహానటి సావిత్రి 44వ వర్ధంతి శుక్రవారం స్థానిక గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై జరిగింది. మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు పరుచూరు విజయలక్ష్మి నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో సావిత్రి చిత్రపటం వద్ద పలువురు పుష్పాలుంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా కళా సంస్థల ప్రతినిధులు, నాయకులు కె.డేవిడ్ రాజు, టి.లక్ష్మణ్ నాయక్, కె.కొండలరావు, పసుపులేటి శ్రీనివాసరావు, కె.వేణుగోవింద్, డా. జయంతి చక్రవర్తి, సూరేపల్లి జోషి, ధూపాటి శ్రీదేవి తదితరులు మహానటికి నివాళులర్పించారు.

సంగీత కచేరీతో నివాళి

విజయవాడ : శ్రీ రంగ భువన విజయం సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి గాంధీనగర్ కౌతా పూరా?నందం కళావేదికపై సినీ సంగీత విభావరి జరిగింది. మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగారావు వర్ధంతి సందరరేగా జరిగిన కచేరీలో వలపర్ల సురేష్, మాధవి, వెంకటేష్, నడకుదురు ఝాన్సీ, ఎం.రవివర్మ, సుమలత, సరళ, వెంకటరమణ తదితర ఔత్సాహిక గాయనీ గాయకులు వివిధ చిత్రాల్లోని పాటలు పాడి ప్రేక్షకుల్ని అలరించారు. కార్యక్రమాన్ని గొట్టుపల్లి ఉమామహేశ్వరరావు నిర్వహించారు. నగరంలో పలు ప్రాంతాల్లో రంగా వర్ధంతి నిర్వహించామని ఆయన తెలిపారు.

అలరించిన పుష్పాంజలి రిథమ్స్..

విజయవాడ : పుష్పాంజలి రిథమ్స్ (పాటల పాఠశాల) ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఆశీష్ స్టూడియోస్ లో తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి జరిగింది. గాయకుడు బాలాజీ కుమార్ (వ్యాఖ్యాత) నిర్వహణలో ఎం.ఎస్.రామారావు, లక్ష్మీదుర్గ, శ్రీనివాస్, ప్రసాద్, సువర్ణలక్ష్మి, (విఎంసి) శ్రీనివాస్, సీతాదేవి, జి.విశ్వనాథ్, రహిమ తదితర ఔత్సాహిక గాయనీ గాయకులు పాడిన తెలుగు హిందీ సినీ పాటలు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. స్టూడియోస్ అధినేత సూర్య ట్రాక్స్ సమకూర్చారు.

అలరించిన 'చిరంజీవి' సంగీత కచేరీ

విజయవాడ : మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగారావు 37వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం రాత్రి గాంధీనగర్ వి.హెచ్. గ్రంథాలయంలో మెగాస్టార్, 'పద్మ విభూషణ్' చిరంజీవికి పాడిన సినీ పాటలతో ప్రత్యేక సినీ సంగీత విభావరి జరిగింది. సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు సౌజన్యంతో 'ఎన్టీఆర్ ప్రణవి మ్యూజికల్ అకాడమీ' ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షుడు, గాయకుడు కారుమంచి రాజు నిర్వహణలో జరిగిన కచేరీలో వసంత్ కుమార్, జయంతి చక్రవర్తి, మాధవి, బొబ్బిలి మల్లేశ్వరి, ఎం.శ్యాంప్రసాద్, మల్లేశ్వరి (ట్రాక్స్), ఎస్.నాగేంద్రరావు తదితర ఔత్సాహిక గాయనీ గాయకులు పాడిన పాటలు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. కచేరీకి బ్రూస్ లీ సౌండ్ సమకూర్చారు.

కనకమేడలను కలిసిన నెట్టెం

విజయవాడ : సుప్రీంకోర్టులో అదనపు సొలిసిటర్ జనరల్‌గా బాధ్యతలు స్వీకరించనున్న కనకమేడల రవీంద్ర కుమార్‌ను శుక్రవారం విజయవాడ బ ఒదావన్ కాలనీలోని ఆయన కార్యాలయంలో ఉమ్మడి కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్, మాజీమంత్రి నెట్టెం శ్రీ రఘురాం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

29 నుండి ఎంబివికె కంప్యూటర్ శిక్షణ కొత్త బ్యాచ్‌లు ప్రారంభం

విజయవాడ : మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన ఈనెల 29వ తేదీ నుండి ఎంఎస్ ఆఫీస్, టాలీ కోర్సులకు కొత్త బ్యాచ్‌లు ప్రారంభించనున్నట్లు ఇన్చార్జి టి.క్రాంతి కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. వయసుతో సంబంధంలేకుండా ఆసక్తి ఉన్న వారు 9014541958, 9490098042 ఫోన్ నెంబర్లలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

మొదటిపేజీ తరువాయి

తలసరి ఆదాయం, స్థూల ఉత్పత్తి పెంచండి

నమోదయ్యాయని, అయితే ఒక్క మరణం కూడా సంభవించకుండా సమర్థవంతమైన వైద్య సేవలతో కృషిచేశామని చెప్పారు. ఎ.కొండూరులో ప్రతివారం నెఫ్రాలజిస్టు వైద్య సేవలను అందిస్తున్నామని, ఇందుకు సంబంధించి గిరిజన తండాల్లో టాంటాం కూడా వేయిస్తున్నామని తెలిపారు. కృష్ణాజలాల పంపిణీపై ట్రయల్ రన్ జరుగుతోందన్నారు. త్వరలోనే పూర్తిస్థాయిలో కృష్ణా జలాలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అదనపు డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కషిచేస్తున్నట్లు వివరించారు. కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం మాట్లాడుతూ వాణిజ్య బ్యాంకులు ఇస్తున్న వివిధ రకాల రుణాలను కేడీసీసీ ద్వారా కూడా ఇచ్చేందుకు చొరవ చూపుతున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని 425 సహకార సంఘాలు, సభ్యులను కూడా సౌరవిద్యుత్ వ్యవస్థకు అనుసంధానించేలా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో సారవంతమైన భూములున్నాయని, ఇరిగేషన్ శాఖ సమన్వయంతో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ప్రగతికి దష్టిసారించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్సీలు మొండితోక అరుణ్‌కుమార్, రుహుల్లా, ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం, డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, సీపీవో వై.శ్రీలత, జెడ్‌పీ సీఈవో కె.కన్నమనాయుడు, ఆర్‌డీవోలు కె.బాలకష్ణ, కె.మాధురి, ఇంకా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిఆర్‌సికి డుమ్మా..!

కావడం లేదు. అభివృద్ధి అనేది శిలాఫలకాలకే పరిమితం అయింది. మరొక వైపున నగర వ్యాప్తంగా శానిటేషన్ దగ్గర నుంచి దోమలు బెడద, మరీ ముఖ్యంగా రక్షిత మంచినీటి సరఫరా ప్రశ్నార్థకంగా తయారయింది. రంగుమారిన, దుర్వాసనతో కూడిన వాటర్‌నే ఆయా ప్రాంతాల్లో ప్రజలు తాగుతూ డయేరియా, ఇతర రోగాల భారిన పడుతున్నారు. అలాగే ఇతర అనేక సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. ఇలాగే రూరల్ ఏరియాలో ముఖ్యంగా ఏ కొండూరు మండలంలో దశాబ్దాల తరబడి కిడ్నీ బాధితుల సమస్య ఉండనే ఉంది. ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు కృష్ణాజలాలను మంచినీటి పైప్‌ల ద్వారా తరలించే స్కీమ్ నిధులు కొరత, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వంలో లోపించిన చిత్తశుద్ధి కారణంగా ఆ స్కీమ్ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయింది. పంటలకు గిట్టుబాటు ధర, వచ్చే రబీ సీజన్‌కు సాగునీటి సమస్య ఇలా జిల్లా వ్యాప్తంగా అనేక సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. ఇటువంటి తరుణంలో ప్రజాప్రతినిధులు డిఆర్‌సి సమావేశానికి విచ్చేసి వారి వారి పరిధిలోని సమస్యలపై అధికారులతో చర్చించి, పరిష్కార దిశగా పని చేయాల్సిన ప్రజాప్రతినిధులు కనీసంగా డిఆర్‌సి సమావేశాలకు కూడా హాజరుకాకుండా ఉండటం పట్ల ప్రజలు, సమస్యల పరిష్కారం పట్ల ఎమ్మెల్యేలకున్న చిత్తశిద్ధి ఏపాటిదోనని ఇట్టే తెలిసిపోతోంది. ఆయా జిల్లాల పరిధిలో జరిగే ప్రతి డిఆర్‌సిలో సంబంధిత ప్రజాప్రతినిధులందరూ తప్పక పాల్గొనాలని ఆదేశిస్తున్నా...క్షేత్ర స్థాయిలో అధినేత ఆదేశాలను మాత్రం అధికార టిడిపి ప్రజాప్రతినిధులు ఖాతరు చేయడం లేదనే చర్చ లేకపోలేదు. ప్రజాప్రతినిధులు హాజరయ్యే తీరును బట్టి రెండు సార్లు వాయిదా వేసినా ...మూడోసారి కూడా ప్రజాప్రతినిధులు రాకపోడం పట్ల .డిఆర్‌సి వేదిక సాక్షిగా ఎమ్మెల్యేల డుమ్మాపై చర్చ జరిగినట్లు సమాచారం.



'మీభూమి'తో భూరికార్డుల ఆధునీకరణ

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మీ భూమి-మీ హక్కు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ కొల్లూరి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో భూ సర్వే రికార్డులు దాదాపు 100 సంవత్సరాల క్రితం తయారు చేశారని, ఆ తర్వాత భూమిపైనే జరిగిన సరిహద్దులు, మార్పులు పూర్తిస్థాయిలో చేయకుండా రికార్డులు కొనసాగిస్తున్నారు. ప్రస్తుత సాంకేతిక, ఆధునిక ప్రమాణాలకు అనుగుణంగా రికార్డులను ఆధునికరి స్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా అవనిగడ్డ ప్రధాన రహదారులలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ తాసిల్దార్ ఏ. శ్రీనివాసరావు, ఎంపీపీ తుంగల. సుమతి దేవి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, సర్పంచ్ గోరు ముచ్చు ఉమా, ఎంపీటీసీ బొప్పన భాను పాల్గొన్నారు.



పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో శుక్రవారం యలమంచిలి గోపీచంద్‌చ స్మారకార్థం నిరు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. తొలుత పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా లయన్స్ మాజీ గవర్నర్ వైపీసీ ప్రసాద్, లయన్స్ అధ్యక్షుడు పెరుమాళ్లు, లయన్స్ ప్రతినిధులు పోలవరపు వెంకట్రావు, పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ కార్మికుల వినతి

ప్రజాశక్తి-బంటుమిల్లి : ఉపాధి హామీ చట్టాన్ని పాత విధంగానే కొనసాగించాలని కోరుతూ బంటుమిల్లి మండలం పెద్ద తుమ్మిడి గ్రామపంచాయతీలో కూలీలు వినతపత్రం శుక్రవారం అందిం చారు. సిఐటియు మండల కన్వీనర్ కో కన్వీనర్లు మాజేటి శివ శ్రీనివాసరావు, కొమ్మలపాటి రవి పాల్గొన్నారు.

అప్పలరాజు అరెస్టు అప్రజాస్వామికం : రైతుసంఘం

ప్రజాశక్తి-బంటుమిల్లి : అనకాపల్లి జిల్లా రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. అప్పలరాజును పిడి యాక్ట్ చట్టంతో అరెస్టు చేయడం అన్యాయమని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం బంటుమిల్లిలో గుండా బత్తుల ఆంజనేయులు భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపైన, రైతాంగ సమస్యల పైన నిరంతరం పోరాడే అప్పలరాజుపై పిడియాక్ట్ చట్టం కింద అరెస్టు చేయడం తగదన్నారు. ఆయనపై పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి మండల రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మలిశెట్టి శివరామ ప్రసాద్, లంకదాసుల అజయ్ ఘోష్, రైతు సంఘం నాయకులు యడ్లపల్లి పెద్దిరాజులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న గౌరిశెట్టి నాగేశ్వరరావు

శ్రామికోత్సవ్ బ్రోచర్ విడుదల

ప్రజాశక్తి - గుడివాడ : సిఐటియు ఆలిండియా మహాసభల సందర్భగా ఈ నెల 28వ గుడివాడలో నిర్వహించనున్న శ్రామికోత్సవ్ కరపత్రాన్ని సాహితీ స్రవంతి, ఐద్వా, ప్రజానాట్యమండలి నాయకులు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. శుక్రవారం స్థానిక సుందరయ్యభవనంలో సాహితీ స్రవంతి అధ్యక్షులు లంక సురేంద్ర మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ సాయంత్రం 6గంటలకు స్థానిక కొత్త మున్సిపల్ కార్యాలయం ఎదురుగా సభను నిర్వహిస్తున్నమన్నారు. ఈ కార్యక్రమానికి సిఐటియు కష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటా రన్నారు. అనంతరం నాట్య ప్రదర్శన, తదితర వినోద కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయా లన్నారు. సాహితీ స్రవంతి కార్యదర్శి ఆలూరి విజయకుమార్, ప్రజానాట్యమండలి నాయకులు యలమర్తి కోటేశ్వరరావు, ఐద్వా కార్యదర్శి పి.రజిని తదితరులు పాల్గొన్నారు.



బ్రోచరున్ విడుదల చేస్తున్న దృశ్యం



రోడ్డుపై నిలిపిన వాహనాలు

రోడ్లపైనే ఇష్టారాజ్యంగా పార్కింగ్‌లు

- మోపిదేవిలో ట్రాఫిక్‌తో ఇబ్బందులు

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవిలో ట్రాఫిక్ ఇబ్బందులతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మోపిదేవిలో ప్రముఖ ఆలయమైన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దర్శనానికి విచ్చేసే భక్తులకు సరిపడిన స్థాయిలో పార్కింగ్ లేకపోవడంతో రహదారు లపైనే వాహనాలు నిలిపి ఉంచాల్సిన పరిస్థితి నెలకింది. మోపిదేవి నుండి అవనిగడ్డ వెళ్లే ప్రధాన జాతీయ రహదారి లిఇరువైపులా వాహనాలు నిలిచి ఉండడంతో ప్రయాణాలు సాగించే వాహనాలు ట్రాఫిక్ చక్రబంధంలో ఇరుక్కుంటున్నాయి. శుక్రవారం ఉదయం మోపిదేవి - అవనిగడ్డ వెళ్లే ప్రధాన జాతీయ రహదారిపై దాదాపు 30 నిమిషాల పాటు ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ప్రస్తుతం ఉన్న పార్కింగ్ పుల్లుగా నిండిపోవడంతో రోడ్ల పక్కనే వాహనాలు నిలుపుకోవాల్సి వస్తుంది. బైకులు, కార్లు తదితర వాహనాలన్నీ రోడ్డు పక్కన నిలిపివేయడంతో మోపిదేవి సెంటర్లో తరు.ఊ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. పార్కింగ్‌కి ఎక్కువ స్థలం కేటాయించాలని, ప్రస్తుతం ఉన్న పార్కింగ్‌కు తోడు కళ్యాణ మండపం వెనుక ఉన్న దేవస్థానం పొలంలో పార్కింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు, పలువురు వాహనదారులు కోరుతున్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-మొవ్వ : కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర ఓరియంటల్ జిల్లా పరిషత్ హైస్కూల్లోని విజయవాడ ఎల్.వి.ప్రసాద్ కంటి వైద్య నేత్రాలయం (తాడిగడప) సాంకేతిక సిబ్బంది శుక్రవారం కంటి పరీక్షలు అవసరమైన విద్యార్థులకు కండ్లజోడులకు సిఫారసు చేశారు. ఈ పరీక్షలలో పాఠశాలల్లోని 203 మంది విద్యార్థిని విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు జొన్నలగడ్డ కవిత పర్యవేక్షించగా ఆప్తమాలిస్టులు మౌనిక, సాస్వతి, ఇర్ఫాన్, ఫీల్డ్‌అసిస్టెంట్ షేక్ అయేషా సహకరించారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

2 నుండి భూ రీసర్వే ప్రారంభం

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లిలో జనవరి 2వ తేదీ నుండి ప్రారంభం కానున్న భూ రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, రీసర్వే డీటీ నీలిమ కోరారు. శుక్రవారం చల్లపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఈవో పివి మాధవేంద్రరావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. సభలో పాల్గొన్న రీ సర్వే డిటి నీలిమ మాట్లాడుతూ రైతులు తమ భూమి దస్తావేజులు, పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్, మొబైల్ నంబరు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోను గ్రామ రెవెన్యూ అధికారికి అందచేయాలని తెలిపారు. ముందుగా రైతులకు సమాచారం



అందించి, పొలం వద్ద వారి హక్కు పత్రాలను పరిశీలించి (గ్రౌండ్ ట్రూతింగ్) సర్వే ప్రక్రియ ప్రారంభిస్తారని వివరించారు. చల్లపల్లి గ్రామంలో మొత్తం 1129.03 ఎకరాల సాగుభూమికి సంబంధించి ఈ రీసర్వే నిర్వహించనున్నారు.

నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డిఎం కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కె. హనుమంతరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నాం 12 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహి స్తున్నామని, అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని ప్రజలు తమ ప్రయాణ అవసరాలపై సూచనలు, సలహాలు ఫోన్ ద్వారా ఇవ్వాలని కోరారు. ప్రయాణికులు 9959 225 466 నెంబర్‌కు ఫోన్‌చేయాలన్నారు.

మామ చేతిలో అల్లుడు దారుణ హత్య

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మామ అల్లుళ్ళ మధ్య మాటామాటా పెరిగి మామ కర్రతో అల్లుడు తలపై కొట్టడంతో మృతి చెందిన ఘటన మండలంలోని పెనమ కూరులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. 2017 సంవత్సరంలో చీకుర్తి శ్రీనివాసరావు కుమార్తె ఝాన్సీరాణితో ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం గజ్జలకొండ గ్రామానికి చెందిన ఆదిమూలపు సురేష్‌తో (31) వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈనెల 24వ తేదీన రెండో కుమారుడు దేవాన్ను సార్థకు పుట్టినరోజు కావడంతో కేక్ తీసుకుని సురేష్ అతని భార్య పెనమకూరులోని అత్తా మామలయింటికి వచ్చారు. పుట్టినరోజు అయిన తర్వాత తెల్లవారితే క్రిస్మస్ పండుగ కావడంతో ఉండిపోయారు. గురువారం రాత్రి సురేష్‌కు అతని మామ శ్రీనివాసరావుకు మాటా మాట పెరిగి గొడవ మొదలైంది. దీంతో కోపోద్రిక్తుడైన శ్రీనివాసరావు అల్లుడు సురేష్ నెత్తిపై కర్రతో బలమైన గాయం చేయటం వల్ల చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తీసుకెళ్లే మార్గం మధ్యలో చనిపోయాడు. గ్రామ వీఆర్వో శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పమిడిముక్కల సీఐ వై.చిట్టి బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మృతుడు సురేష్

విదేశాల్లో ఉద్యోగం పేరుతో రూ.32 లక్షలకు టోకరా

ప్రజాశక్తి-కంకిపాడు : విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తానని ఓ మహిళ వద్ద నుంచి ఓ వ్యక్తి రూ.32 లక్షల రూపాయలు కాజేసిన వైనంపై కేసు నమైంది. వివరాల్లోకి వెళితే తాడిగడప గ్రామానికి చెందిన ఒక మహిళ లండన్‌లో ఉద్యోగం చేస్తూ గత సంవత్సరం డిసెంబర్‌లో భారతదేశానికి వచ్చారు. మళ్లీ ఉద్యోగ అవకాశాల కోసం వెతుకుతున్నప్పుడు ఆమెకు ఇంస్టాగ్రామ్ ద్వారా మైఖేల్ విన్సెంట్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది.. అతను తాను ఇమ్మిగ్రేషన్లో పనిచేస్తున్నానని చెప్పి లండన్‌లో ఉద్యోగాల అవకాశాలు అందిస్తున్నట్లు చెప్పగా అతని మాటలు నిజమే అని నమ్మిన ఆమె మొదల లక్ష రూపాయలు చెల్లించింది. తర్వాత ఈ సంవత్సరం అక్టోబరు నెలలో ఆ మహిళకు ఇంటర్వ్యూ నిర్వహించి లండన్‌లోని థాట్ వర్క్స్ లిమిటెడ్‌లో అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్‌గా ఎంపికయ్యారని చెప్పి ఆమెకు ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా నకిలీ ఇమెయిల్‌లను పంపాడు. అది నిజమేనని నమ్మిన ఆమె పలు విడతలుగా రూ.32,08,000 మొత్తాన్ని అతనికి ట్రాన్స్‌ఫర్ చేసింది. మహిళ వీసా బయోమెట్రిక్స్ కోసం ఎదురు చూస్తున్నప్పుడు, మళ్లీ అదనంగా 7,500 పౌండ్లు డిమాండ్ చేస్తూ ఒక ఇమెయిల్ వచ్చింది. దాంతో ఆమెకు అనుమానం వచ్చి ఈ మెయిల్స్ చెక్ చేయగా ఇమెయిల్ డొమైన్ ఉనికిలో లేదని తేలింది. దీంతో ఆమె మోసపోయానని గ్రహించి ఎన్‌సిఆర్‌పి పోర్టల్‌లో ఫిర్యాదు చేసింది.

పేకాటరాయుళ్లు అరెస్ట్

ప్రజాశక్తి-పామర్రు : మండల పరిధి పెరిసేపల్లి లో పేకాడు తున్న నలుగురు జూదరులను పామర్రు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. గ్రామ శివారు కాలవ గట్టు పై పేకాట ఆడుతున్న వారిపై పామర్రు సిఐ వి.శుభాకర్, ఎస్సై వి.రాజేంద్రప్రసాద్, ట్రైనింగ్ ఉమెన్ ఎస్ఐ ఎల్.సత్య కళ తన సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద నుండి 9,600 రూపాయల నగదు, సది మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

హైకోర్టు ఉత్తర్వులతో దేవాలయ భూమి స్వాధీనం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలోని బద్రిరాజుపాలెం గ్రామపంచాయతీ సౌత్ వల్లూరు రెవెన్యూ పరిధిలో ఉన్న రెండు ఎకరాల మాగాణి భూమిని కోర్టు ఉత్తర్వుల ప్రకారం శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు తోట్లవల్లూరు వేణుగోపాలస్వామి దేవస్థాన కార్యనిర్వహణాధికారి కె.శ్రీనివా సరెడ్డి తెలిపారు. గుంటూరు జిల్లా కొల్లిపర మండలం పిడపర్రు గ్రామంలో శ్రీ సోమేశ్వర స్వామి వారి దేవస్థానానికి చెందిన భూమి బద్రిరాజుపాలెం గ్రామపంచాయతీ పరిధిలో వున్నదని ఆ భూమి దేవాలయ భూమి అని కోర్టు నిర్ధారిం చడం ద్వారా దేవస్థానం వారు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులివ్వాలి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

రాష్ట్ర ప్రభుత్వం డప్పు కళాకారుల సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేసి, డప్పుకు జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురావాలని ఏపీ డబ్బు కళాకారుల సంఘం (ఏపీడీకేఎస్) రాష్ట్ర కార్యదర్శి గుండిమెడ క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని డివిఆర్ నగర్‌లో గల సిఐటియు కార్యాలయంలో శుక్రవారం మండల డప్పు కళాకారుల సంఘం మహాసభ డప్పు కళాకారుల సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి మల్లవరపు కుటుంబరావు అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండిమెడ క్రాంతికుమార్ హాజరై మాట్లాడుతూ జనవరి 4వ తారీఖున విశాఖపట్నంలో జరిగే కార్మిక ప్రదర్శనలో భాగస్వామ్యం కావాలని, పాటకు, ఆటకు గుర్తింపునిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డప్పుకు ఎందుకు గుర్తింపునివ్వడం లేదని మండిపడ్డారు. డప్పులు వాయించేది దళితులు కాబట్టే అంటరానివారిగా వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేర్చుకున్న కళలకు రూ.7 వేలు పెన్షన్ ఇస్తుండగా, ప్రాచీన కళ డప్పును నమ్ముకున్న కళాకారులకు రూ. 4 వేలే పెన్షన్ ఇస్తారా..? ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. డప్పు కళాకారుల వయోపరిమితిని 45కు తగ్గించి పెన్షన్ రూ. 7 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నార కాలం గడిచిపోయినా ఇప్పటివరకు డప్పు కళాకారుల పెన్షన్ కు ఆన్లైన్ ప్రారంభించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డప్పు కళాకారులకు ధార్మిక క్షేత్రాల్లో ప్రదర్శనలకు, ట్రస్ట్ బోర్డుల్లో మెంబర్లుగ అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గుర్తింపు కార్డులివ్వడంతో పాటు బస్సు, రైలు ప్రయాణల్లో రాయితీ ఇవ్వాలని సూచించారు. ఉండడానికి ఇల్లు, డప్పు కళ అంతరించపోకుండా శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. రూ.10 లక్షల ప్రమాద బీమా చెల్లించాలని డిమాండ్ చేశారు. డప్పు కళాకారులు సమరశీల ఐక్య పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కరించుకోగలరని నాయకులు పిలుపునిచ్చారు. **నూతన మండల కమిటీ ఎన్నిక:** డప్పు కళాకారుల సంఘం మండల అధ్యక్షులుగా యండ్రాతి ప్రకాష్ రావు, మండల ఉపాధ్యక్షులుగా ఆదిమండ్ల అబ్రహం, మండల కార్యదర్శిగా ఆదిమల్ల నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షులుగా జే వెంకట్రావు కమిటీ సభ్యులుగా బి ప్రసాద్, రామారావు, కోటేశ్వరరావు, నెమలి ఆనందరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న క్రాంతికుమార్



సిఐటియు మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నందిగామ: విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిల భారత 18వ మహసభలను జయప్రదం చేయాలని సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు కె.గోపాల్ పేర్కొన్నారు. ఈసందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు కె. గోపాల్ మాట్లాడుతూ లేబర్ కోడ్ లు రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, స్కీం వర్కర్లని, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, డైలీవేజ్, కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. బిల్డింగు సంక్షేమ బోర్డుని పునర్ధరించాలి, పెండింగ్లో ఉన్న క్లెయిమ్స్ విడుదల చేయాలని, విద్య , వైద్యం ప్రభుత్వ రంగాల్లో కొనసాగించాలని, కనీసం పెన్షన్ నెలకు 9000 ఇవ్వాలని, విద్యుత్ సవర్ణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి దసవరపు సైదా, సలికేటి నరేష్, మాణిక్యం, ప్రసాద్, సంతీష్ తదితరులు పాల్గొన్నారు.

బిపిఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-విజయవాడ: అనధికార భవనాలను క్రమబద్ధీకరణ చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్‌ను (బిపిఎస్) సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదలచేస్తూ... ఎంఎ అండ్ యుడి గత ఏడాది విడుదల చేసిన జీఓ ఎంఎస్ నెంబర్ 225 ప్రకారం...1985 జనవరి 1వ తేదీ తరువాత నుంచి ఈ ఏడాది ఆగస్టు 31 వరకు నిర్మించిన అనధికార భవనాలు, ఆమోదిత నిర్మాణ అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన అదనపు విస్తరణలు క్రమబద్ధీకరణకు అర్హులని అన్నారు. ఈ స్కీమ్ కింద అర్హులయిన భవన యజమానులు వచ్చే ఏడాది (2026) మార్చి 11 లోపులో ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ పథకం కింద 1997 డిశంబర్ 31కు ముందు నిర్మించిన భవనాలకు క్రమబద్ధీకరణ రుసుంపై రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం రాయితీ ప్రకటించిందన్నారు.

ఇంగ్లీష్ పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి-తిరువూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఎటువంటి భయం లేకుండా సులభంగా ఇంగ్లీష్ నేర్చు కోవడానికి క్లాస్ రూమ్ ఇంగ్లీష్ పుస్తకం ఉపయో గ పడుతుందని మండల విద్యాశాఖాధికారి పి.ఎస్.ఎన్. రాజు అన్నారు. పుస్తక రచయిత ఎం. రాంప్రదీప్ మాట్లాడుతూ దాతల సహకా రంతో ఇప్పటి వరకు రెండు తెలుగు రాష్ట్రాల లోని వందకు పైగా ప్రభుత్వ పాఠశాలలకు 50 వేల రూపాయల విలువ చేసే పుస్తకాలను ఉచి తంగా పంపిణీ చేశామన్నారు. తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల లైబ్రరీకి శుక్రవా రం ఆయన పుస్తకాలను అందజేశారు. ఈకా ర్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయులు కె.లావణ్య, ఎన్. గీత తదితరులు పాల్గొన్నారు.



ఆరెంజ్ కేక్‌తో పండుగ వేడుకలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: నూతన సంవత్సరం సందర్భంగా డార్క్ చాక్లెట్ బాదం ఆరెంజ్ కేక్‌తో వేడుకలు నిర్వహిస్తున్నామని ప్రముఖ చెఫ్ కబితాసింగ్ అన్నారు. నగరంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఎంతో ఆలోచించి రూపొందించిన ఈ వంటకం పండుగ రుచులకు, ఆరోగ్యకరమైన బేకింగ్ విధానానికి మధ్య చక్కటి సమతుల్యతను పాటిస్తుందని తెలిపారు. నెయ్యి, గుడ్లు, బాదం పిండితో తయారు చేయడం వల్ల ఈ కేక్ మెత్తగా, తేమగా ఉంటుందని, ఇందులో చాక్లెట్, సిట్రస్ రుచులు అద్భుతంగా కలుస్తాయని అన్నారు. మ్యాక్స్ హెల్త్‌కేర్ రీజినల్ హెడ్ – డైటెటిక్స్ రితికా సమద్దార్ మాట్లాడుతూ కాలిఫోర్నియా బాదంలో ప్రోటీన్, ఫైబర్, మంచి కొవ్వులు, విటమిన్ ఇ, అవసరమైన ఖనిజాలు సహజంగానే ఉంటాయని తెలిపారు. ఇవి పండుగ వంటకాలకు ఒక స్మార్ట్ అడిషన్ అని, ఇవి గుండె ఆరోగ్యానికి మద్దతిస్తాయని తెలిపారు.

ఆటోనగర్లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట సమీపంలోని ఆటోనగర్ లోని ఇండస్ట్రియల్ పార్కులో శుక్రవారం యజమానులు, కార్మికులు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆటోనగర్ ప్రాంతంలో ఇప్పటికే మూడు వంతులు, కర్మాగారాలు మూతపడగా మిగతావారు కెమికల్ కాలుష్యంతో మరియు సౌకర్యాల లేమితో కర్మగారాలు నడుపుకోలేని పరిస్థితిలో అల్లాడుతున్నారు. దీనిమీద తక్షణమే అన్ని రకాలుగా ఉద్యమించాలని, కార్మికులు యజమానులు నిర్ణయం తీసుకున్నారు. జగ్గయ్యపేట మున్సిపాలిటీ ఈ ప్రాంతాన్ని తమ పరిధిలోకి చేర్చుకున్న తర్వాత కూడా ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదని, మున్సిపాలిటీలో ఈ ప్రాంతాన్ని కలపడం వల్ల ట్యాక్స్‌లు మాత్రం పెంచేశారని అన్నారు. ఏపీఐఐసి వారు పొల్యూషన్ కంట్రోల్ వారు ఎలాంటి బాధ్యత తీసుకోకుండా 18 సంవత్సరాలుగా ఆటోనగర్‌ని పనికిరాని ప్రదేశంగా మార్చేశారని,ఆటోనగర్ యజమానులకు, ఐపీ యజమానులకు, ఉమ్మడి స్థలాలుగా ఉన్నటువంటి వాటిని అన్యాక్రాంతం చేశారని, కార్మికులు, యజమానులు తమ కష్టాలు ఎవరికి చెప్పుకోవాలో కూడా తెలియని పరిస్థితిలో ఉన్నామని చెప్పారు. వీలైనంత త్వరగా ఒక ఎగ్జిక్యూటివ్ బాడీని ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. సంబంధిత అధికారులను కలిసి తమ నిరసన మరియు అవసరాలను తెలియజేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ధరణికోట వెంకటరమణ, గద్దె నాని, మస్తాన్ మేస్త్రి ల ఆధ్వర్యంలో జరగినది. ఈ కార్యక్రమంలో యజమానులు మందడపు శ్రీనివాస్ తరపున వారి మేనేజర్లు, జెసిబి మెకానిక్ షెడ్ శేఖర్, ముజీబ్, మస్తాన్, కరీం, రాంబాబు, నరసింహారావు, బాబు, సత్తార్, బోసు, ఖాదర్ తదితర యజమానులు, కార్మికులు పాల్గొన్నారు.



రీసర్వేకు సహకరించండి

ప్రజాశక్తి-గంపలగూడెం: రెండో తేదీ నుండి జరగనున్న రీ సర్వే కార్యక్రమానికి రైతులంతా సహకరించాలని గంపలగూడెం తాసిల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి కోరారు. మండలంలో 14 గ్రామాలలో రీసర్వే పూర్తి చేయగా, మిగిలిన గ్రామాల్లో ఫేస్-1 ప్రారంభమవుతున్నట్లు వివరించారు. ఈ మేరకు లింగాల ఆర్లపాడు ఊటుకూరు గ్రామాల్లో అవగాహన కల్పించారు. సర్వే నేపథ్యంలో రైతులు అధికారులకు తమ ఆస్తులకు సంబంధించిన పత్రాలను చూపించాలని కోరారు. ముందుగా రీ-సర్వేపై అవగాహనకు ర్యాలీ నిర్వహించారు.

275 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: స్థానిక అమర్ భవన్‌లో వైసిపి మండల కన్వీనర్ కుప్పిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ప్రముఖ ఆర్థోపెడిక్ ఎంజె నాయుడు ఆసుపత్రి ద్వారా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 275 మందికి వైద్య సేవలు అందించారు. వీరిలో 45 మందికి ఎంఆర్ఐ, వివిధ సమస్యలు నిమిత్తం రిఫర్ చేయడం జరిగింది. అనంతరం రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జాఫర్, డైరెక్టర్ సందీప్, వైస్ ఎంపీపీ చాట్ల రాబర్ట్, జిల్లా ఐటీ వింగ్ జనరల్ సెక్రెటరీ గుడిసె ప్రభాకర్‌రెడ్డి, సిపిఎం సీనియర్ నాయకులు మద్దిరెడ్డి మాధవరెడ్డి, ఉయ్యూరు కృష్ణారెడ్డి, పైడిమర్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రకీలాద్రికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ

ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దర్శనానికి శుక్రవారం యాత్రికులు భారీగా తరలివచ్చారు. పెరిగిన రద్దీ దృష్ట్యా ఇఒ శీనా నాయక్ స్వయంగా క్యూ లైన్లను పర్యవేక్షించారు. వైర్లెస్ సెట్, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా సిబ్బందికి సూచనలు జారీ చేశారు. సర్వదర్శనానికి ప్రాధాన్యత ఇచ్చి, యాత్రికులకు త్వరిత దర్శనం కల్పించారు.

సిపిని కలిసిన ఇన్‌స్పెక్టర్లు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనరేట్‌లో సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న బి.గుణరామ్‌ను ఒన్ టౌన్ పోలీసు స్టేషన్‌కు, సిఎస్‌బిలో విధులు నిర్వహిస్తున్న డి.వి.రమణను మాచవరం పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా వారిరువురూ శుక్రవారం ఆయా పోలీస్‌స్టేషన్లలో ఎస్‌హెచ్ఓలుగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వారిరువురూ నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబును కమిషనరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలను అందజేశారు.



'సైక్ సిద్ధార్థ్' చిత్ర యూనిట్ సందడి



ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: చిత్రం ప్రమోషన్‌లో భాగంగా నగరంలో సైక్ చిత్ర యూనిట్ విచ్చేసి సరదాగా హీరో హీరోయిన్ క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా హీరో శ్రీ నందు హీరోయిన్ యామిని భాస్కర్ తో ఫోటోలు దిగేందుకు స్థానిక ప్రజలు పోటీపడ్డారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో శ్రీ నందు మాట్లాడుతూ తాను నిర్మాతగా తొలిసారి సైక్ సిద్ధార్థ్ చిత్రాన్ని నిర్మించడం జరిగిందని చెప్పారు. ఈ చిత్రంలో తాను సిద్ధార్థ్ క్యారెక్టర్ లో ప్రేక్షకులను అలరించనున్నట్లు తెలియజేశారు. విజయవాడ నగరం నుంచి తన చిత్ర ప్రమోషన్ ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు తాను విజయవాడ వాసినీ అని సినిమాపై ఆసక్తితో హైదరాబాద్ కు వెళ్లడం జరిగిందన్నారు. సైక్ సిద్ధార్థ్ చిత్రం పూర్తిగా ప్రేమ బ్రేకప్ నేపథ్యంలో సాగుతుందన్నారు. బ్రేకప్ జరిగిన విషయాన్ని హాస్య భరితంగా ప్రేక్షకులకు చూపించనున్నట్లు వివరించారు. సామాన్య కుటుంబాల మధ్య ఇంటి ఉండే ఒక అబ్బాయి కథే ఈ చిత్రమని అన్నారు. కాబట్టి యూనిట్ అంతా కలిసి ఒక టీం గా పనిచేసే చిత్రాన్ని తక్కువ బడ్జెట్ లోనే నిర్మించడం జరిగిందని ప్రతి ఒక్కరూ ఈ చిత్రాన్ని వీక్షించి తమను ఆశీర్వదించాలని ఆయన కోరారు. తమ చిత్రాన్ని ప్రముఖ సురేష్ ప్రొడక్షన్స్ కొనుగోలు చేసి విడుదల చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తమ సినిమాలో ఉన్న కథ బలాన్ని నమ్మి సురేష్ ప్రొడక్షన్స్ అధినేత సురేష్ బాబు చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారని తెలిపారు. నూతన సంవత్సరం కానుకగా జనవరి ఒకటో తేదీన చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు ఆయన వివరించారు. అనంతరం హీరోయిన్ యామిని భాస్కర్ మాట్లాడుతూ తాను విజయవాడ వాసిని అని గతంలో పలు ప్రముఖ చిత్రాలలో ముఖ్య పాత్రలలో నటించడం జరిగిందన్నారు. ఈ చిత్రంలో హీరో శ్రీ నందు తనకు హీరోయిన్ అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. ఈ చిత్రంలో తన క్యారెక్టర్ నిజ జీవితానికి ఎంతో దగ్గరగా ఉంటుందని ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుందని ఆమె తెలియజేశారు. అనంతరం చిత్ర దర్శకుడు వరుణ్ రెడ్డి మాట్లాడుతూ రొటీన్ కి భిన్నంగా ఈ చిత్రం నిర్మించడం జరిగిందన్నారు. ప్రేమ కథ ప్రేమ కథాంశానికి ఎంటర్టైన్మెంట్ను జోడించడం జరిగిందన్నారు. హార్ట్ బ్రేక్ సన్నివేశాలు ప్రేక్షకుల హదయాలను కలచి వేస్తాయని అన్నారు. ప్రతి సన్నివేశం ఎంతో అద్భుతంగా తీశామని ఈ చిత్రాన్ని జనవరి ఒకటో తేదీన విడుదల చేస్తున్నామని ప్రతి ఒక్కరూ ఈ చిత్రాన్ని వీక్షించి చిత్రాన్ని విజయవంతం చేయాలని ఆయన ప్రేక్షకులను కోరారు.

నేడు 'చలో రాజ్యభవన్'ను విజయవంతం చేయండి

- ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకరరెడ్డి

ప్రజాశక్తి - ఉయ్యూరు : కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకరరెడ్డి విమర్శించారు. స్థానిక శ్రామిక భవన్లో శుక్రవారం ఎపి రైతు సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వామపక్షాల ఒత్తిడితో అప్పటి యుపిఎ ప్రభుత్వం 2005లో మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. ఇప్పుడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దానిని రద్దు చేయడంతోపాటు మహాత్మాగాంధీ పేరును మార్చేందుకు పూనుకుంటోందన్నారు. ఇందు కోసం నూతన చట్టం తీసుకొస్తోందని విమర్శించారు. గ్రామీణ ప్రజలకు హక్కుగా ఉన్న పాత చట్టాన్ని నిర్వీర్యం చేసి, కొత్తచట్టం తీసుకువచ్చి కార్మికుల పొట్ట కొడుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన చట్టాన్ని రద్దుచేసి పాతచట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యాన శనివారం తలపెట్టిన "చలో రాజ్యభవన్' కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై.కేశవరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. హరిబాబు, జిల్లా అధ్యక్షుడు కె.శివనాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి



సిఐటియు మహాసభ కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఓ.గంగాధర్ సుధీర్ టింబర్ డిపో వర్కర్లను కోరారు. శుక్రవారం సుధీర్ టింబర్ డిపో యూనియన్ వర్కర్లతో కలిసి కరపత్రాల పంపిణీ చేశారు. డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే 18 సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని కరపత్రాలను పంపిణీ చేసి గోడ ప్రతిని విడుదల చేశారు. టింబర్ డిపో యూనియన్ అధ్యక్షులు వల్లూరు శివ నాగబాబు. కార్యదర్శి మద్దాల శివకృష్ణ, దాసరి విజయ్‌కుమార్. మాదాసు జయమ్మ. వల్లూరి శ్రీహరి. మద్దాల ప్రభాకర్, సుబ్రహ్మణ్యం. చంటి. పాల్గొన్నారు.



రావి రత్నగిరికి సన్మానం

ప్రజాశక్తి-మోపిదేవి : జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధిగా నియమితులైన రావి రత్నగిరిని మోపిదేవి తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద మోపిదేవి మండల టిడిపి నేతలు శుక్రవారం ఘనంగా సన్మానించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధన్ రావు, మండల కో ఆప్షన్స్ సభ్యులు చందన రంగారావు, పిఎసిఎస్ అధ్యక్షులు బల్లా సీతారాం ప్రసాద్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పుప్పాల యేసు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి ఘంటసాల : సంక్రాంతి పండుగ వేళ పౌరుషానికి ప్రతీకగా నిలిచే ఒంగోలు గిత్తల సత్తాను చాటేందుకు ఘంటసాల సిద్ధమైంది. 'మన ఊరు - మన సంక్రాంతి' సంబరాల్లో భాగంగా నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి వృషభ రాజముల బండలాగుడు పోటీల గోడపత్రికను శుక్రవారం ఘంటసాలలోని బాలపార్వతీ సమేత జలధీశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. డాక్టర్ గొర్రెపాటి నవనీత కృష్ణ మెమోరియల్ ఆధ్వర్యంలో 2026 జనవరి 14 నుండి 16 వరకు మూడు రోజుల పాటు ఈ క్రీడా సంబరాలు జరగనున్నాయి. ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో నిర్వాహక ప్రతినిధులు మాట్లాడుతూ తెలుగువారి వీరత్వానికి గుర్తుగా నిలిచే ఈ క్రీడను ప్రతి ఏటా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనవరి 14న ఉదయం 9 గంటలకు ఒంగోలు జాతి ఆవుల అందాల పోటీలు, అనంతరం 'ఆరు పళ్ళ' విభాగంలో బండలాగుడు ప్రదర్శన ఉంటుందన్నారు. జనవరి 15న 'న్యూ కేటగిరీ' విభాగంలో హెూరాహెూరీ పోటీలు. (ప్రథమ బహుమతి: రూ. 60,000), జనవరి 16: 'రెండు పళ్ళ' (జూనియర్) విభాగంలో గిత్తల సత్తా ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బండి పరాత్పరరావు, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, కమిటీ అయినపూడి భాను ప్రకాష్, వేమూరి రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం



బందరు అభివృద్ధికి కృషి : మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌ని మౌలిక వసతుల కల్పనలో రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దాడమే లక్ష్యం గా పని చేస్తున్నట్లు రాష్ట్ర గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శుక్రవారం 39 వ డివిజన్ ఇన్చార్జ్ కట్టా అంజిబాబు, క్లస్టర్ ఇన్చార్జ్ అక్కుమహంతి రాజా, యూనిట్ ఇన్చార్జ్ మేట్టు సూరిబాబుల పర్యవేక్షణలో వెంకటేశ్వర స్వామి దేవస్థానం వద్ద నుండి శంకర మఠం వరకు ఆరు లక్షల 50 వేల రూపాయాల ఖర్చుతో 230 మీటర్ల డ్రైనేజ్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మచిలీపట్నం నగర అభివద్ధికి అనేక ప్రణాళికల రూపొందించి అమలు చేయనున్నట్లు చెప్పారు. ఉమ్మడి కష్ణా జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణతో పాటు మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొర్రెపాటి గోపిచంద్,మార్కెట్ యార్డు చైర్మన్ కుంచె నాని, బచ్చుల బోస్ ,ఎం.డీ ఇలియాస్ పాషా ,బ్రహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి. ఫణి, ఆక్వా కార్పొరేషన్ డైరెక్టర్ లంకె నారాయణ ప్రసాద్, కార్పోరేటర్లు పాల్గొన్నారు.

టిడిపి నూతన కమిటీ సభ్యులకు సన్మానం

ప్రజాశక్తి-అవనిగడ్డ : జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ నూతన కమిటీ సభ్యులుగా నియమితులైన ఆనగడ్డ నియోజకవర్గం చెందిన పలువురు నాయకులను పార్టీ కార్యాల యంలో ఘనంగా సన్మానించారు. శుక్రవారం కమిటీ సభ్యులుగా నియమితులైన లకనం. నాగాంజనేయులు, రావి. రత్నగిరి, కొల్లూరి. బసవేశ్వరరావు (ఇమ్మానుయేలు), సోలే భార్గవి లను పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు పూలదం డలు వేసి, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులకు తగిన గుర్తింపు లభించిందని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నిబద్ధతగల నాయకులకు జిల్లా కమిటీలో చోటు దక్కటం పట్ల హర్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ బండే. కనకదుర్గ రాజశేఖర్ స్వామి టెంపుల్ చైర్మన్ ఘంటసాల రాజమోహన్రావు, అశ్వరావు పాలెం నీటి సంఘాల అధ్యక్షులు దాసినేని శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పర్చూరి. దుర్గాప్రసాద్, బం డే రాఘవ పాల్గొన్నారు.


నూతన కమిటీని సత్కరిస్తున్న దృశ్యం

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి : కొనకళ్ల

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యో ్స్తుల సమస్యలను కూటమి ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించిందని ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు తెలిపారు. మెడికల్ అన్ ఫిట్ అయిన ఆర్టీసీ ఉద్యోగులకు ప్రత్యామ్నాయ విధులు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై కొనకళ్ల నారాయణరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఏఒక్క ఉద్యోగి కూడా నష్టపోకూడదనే ప్రభుత్వ ఉద్దేశమని, అందుకే వారి సమస్యలను పరిష్కరి ంచడానికి ఈ ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ కాగిత కృష్ణప్రసాద్

సోలార్‌తో విద్యుత్ ఖర్చులు తగ్గుదల : ఎంఎల్ఎ కాగిత

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటిమిల్లి మండలం ఆదిత్య సోలార్ వరల్డ్ ఫస్ట్ యానివర్సరీ సెలబ్రేషన్స్‌లో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. బంటుమిల్లికి చెందిన అర్జ సత్యనారాయణ ఆదిత్య సోలార్ స్థాపించి సంవత్సరం అవ్వడం, అలాగే 365 కలెక్షన్లు ఇచ్చిన సందర్భంగా సభ నిర్వహించారు. ఈసభలో పాల్గొన్న ఎంఎల్ఎ మాట్లాడుతూ సోలార్ వలన అనేకమైన ప్రయోజనాలు ఉన్నాయని, విద్యుత్ ఖర్చు తగ్గించవచ్చని అన్నారు. సోలార్‌తో మనం ఉపయోగించుకొని మిగిలినది అమ్ముకుంటే అదనంగా మన అకౌంట్లోకి సబ్సిడీ అమౌంట్ కూడా పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మండల కన్వీనర్ కోనపు రెడ్డి వీరబాబు, పెడన జెడ్పిటిసి నగేష్ , కృత్తివెన్ను డిసి చైర్మన్ బొర్ర కాశి, నక్కంటి భాస్కర్‌రావు, కృష్ణా కోపరేటివ్ బ్యాంక్ ప్రెసిడెంట్ ఇల్లూరి లీలా కృష్ణ పాల్గొన్నారు



ఎజి అండ్ ఎస్ఎస్ వాకర్స్ అసోసియేషన్‌కు అవార్డులు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఏజిఅండ్ ఎస్ఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్‌కు వివిధ అంశాలు, సేకార్యక్రమాలకు సంబంధించి 11 అవార్డులు లభించాయి. గుడివాడలో శుక్రవారం జరిగిన జిల్లా అసోసియేషన్ అవార్డుల ప్రదానోత్సవంలో ఏజీఅండ్ ఎస్ఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సత్తార్, పూర్ణచంద్రరావుతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వరరావు, తులసీరామ్ తదితరులు జిల్లా గవర్నర్ సనకా సుబ్బారావు, ఇతర సభ్యుల నుంచి అవార్డులు అందుకున్నారు.

మృతుడికి నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ : రోడ్డు ప్రమాద మృతుని కుటుంబాన్ని నియోజకవర్గ యువ నాయకులు మండ లి వెంకట్ రామ్ శుక్రవారం పరామర్శించారు. నాగాయలంక మండలం ఒక్కపట్ల వారి పాలెం ఎన్టీఆర్ కాలనీకి చెందిన బందెల దిలీప్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా దీనితో విషయం తెలుసుకున్న వెంకట్ రామ్ శుక్రవారం ఉదయం అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిలో దిలీప్ మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతోపాటు ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వ రరావు, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి, టిడిపి మండల పార్టీ నాయకులు బండే. రాఘవ తదితరులు పాల్గొన్నారు.


మృతుడి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న వెంకట్రాం



మన్మోహన్ సింగ్‌కు నివాళి

ప్రజాశక్తి-తిరువూరు: మాజీ ప్రధాని, పద్మ విభూషణ్ డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రథమ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరువూరులోని రాజీవ్ భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పల్లెపాటి శ్రీనివాసరావు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళుల ర్పించారు. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, డిప్యూటీ చైర్మన్‌గా, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా, ప్రధాన మంత్రిగా దేశానికి మన్మోహన్ చేసిన సేవలను కొనియాడారు. స్వాతంత్ర సమరయోధుడు ఉద్ధంసింగ్, మాజీ రాష్ట్రపతి శంకర్ దయాల్ శర్మ వర్ధంతిలను పురస్కరించుకొని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జీవన్‌బాబు, నాయకులు గంజా కృష్ణమోహన్, చిన్నంశెట్టి నాగేశ్వరరావు, ఇజ్జాడ జగన్నాథం, ఇమ్మనేని శ్రీనివాసరావు, కెఎల్ రావు, కుంచం చందర్రావు తదితరులు పాల్గొన్నారు.

రాధాకు సత్కారం

ప్రజాశక్తి- తాడేపల్లి: మహానాడులో రాధా రంగా మిత్రమండలి ఆటో యూనియన్ సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న రంగా తనయుడు యువనేత వంగవీటి రాధాను జనసేన యువజన నాయకులు జొన్న రాజేష్, జనసేన తాడేపల్లి టౌన్ అధ్యక్షులు అంబటి తిరుపతిరావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నేత తోట సాంబశివరావు పాల్గొన్నారు.

అమరావతిలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-తుళ్లూరు: రాజధాని అమరావతిలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహం, స్మ తివనం ఏర్పాటుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు ప్రారంభించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జె నవీన్ ప్రకాష్, సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం రాజధాని ప్రాంతం తుళ్లూరులోని సిఐటియు కార్యాలయంలో నవీన్ ప్రకాష్, భాగ్యరాజు మాట్లాడుతూ, టిడిపి ప్రభుత్వం 2017లో రాజధానిలోని శాఖామూరు వద్ద 50 ఎకరాలలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం,స్మ తివనం, ఆడిటోరియం,పరిశోధనా కేంద్రం తదితర నిర్మాణాలను చేపడతామని ఆరాటేంగా ప్రకటించిందని అన్నారు.నాడు చెప్పిన మాటలు నేటికీ ఆచరణలో కనబడటం లేదన్నారు.టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పైగా గడిచినా ప్రభుత్వం విగ్రహం, స్మ తివనం ఊసే ఎత్తడం లేదన్నారు.వైసిపి ప్రభుత్వం రాజధానిని మార్చకుండా ముఖ్య భూమిక పోషించిన రాజ్యాంగం రూపశిల్పి అంబేద్కర్ విగ్రహం ఏర్పాటులో ప్రభుత్వానికి ఎందుకింత నిర్లక్ష్యమని వారు ప్రశ్నించారు. రాజధానిలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సంతోషమేనని,అంబేద్కర్, మహాత్మా గాంధీ విగ్రహాల ఏర్పాటుపై కూడా ప్రభుత్వం శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు ప్రదేశంలో పిచ్చిచెట్లు పెరుగుతున్నాయన్నారు. రాజధానిలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటే కాకుండా దళితులు, పేదలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పన లోనూ ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతోందన్నారు.రాజధాని నిర్మాణ పనుల్లో స్థానికులకు అవకాశం లేకుండాపోయిందన్నారు.రాజధాని నిర్మాణ పనుల్లో ఉన్న వేలమంది కార్మికులలో స్థానికులు ఎంతమంది ఉన్నారో ప్రభుత్వం చెప్పాలన్నారు. రైతులకు ట్రాక్టర్లు,కార్లు ఉన్నాయని, వాటిని నిర్మాణ పనుల్లో వినియోగించుకోవడం లేదన్నారు.రాజధాని నిర్మాణ బాధ్యత నుంచి కేంద్ర ప్రభుత్వం తప్పుకొని నిధులు ఇవ్వకుండా అప్పులకు మాత్రమే సాయం చేస్తామని అనడం వల్లనే నిర్మాణ పనులు అనుకున్నంత వేగంగా జరగడం లేదని అన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతే నని కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకురాకుండా తాత్సారం చేస్తోందని మండిపడ్డారు.


వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి-విజయవాడ

కృష్ణలంక 22వ డివిజన్‌లో శానిటేషన్ మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని సిపిఎం తూర్పు సిటీ కమిటీ కార్యదర్శి పి.కృష్ణ కోరారు. ఈ మేరకు ఆపార్టీ తూర్పు సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు బత్తుల చిన్నారావు, ఇతర నేతలను కలుపుకొని స్థానిక శానిటరీ ఇనిస్పెక్టర్ శివరామకృష్ణకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ కృష్ణలంక 22వ డివిజన్‌లో శానిటేషన్ మెరుగుదలకు చర్యలు తీసుకోకుంటే స్థానిక ప్రజలను కలుపుకొని ఉద్యమించాల్సి వస్తోందని పేర్కొన్నారు. విజవాడ నగరపాలక సంస్థ ప్రజల వద్ద నుంచి వివిధ రూపాల్లో పన్నులు వసూలు చేస్తున్నా... ఆమేరకు ప్రజలకు సేవలు అందించడం లేదని అన్నారు. శానిటేషన్ అత్యంత దారుణంగా తయారయిందని, డ్రైయినేజీ క్లీనింగ్ దగ్గర నుంచి వీధులు, ప్రధాన రహదారులు స్వీపింగ్, యుజిడీ నిర్వహణ అధ్వాన్నంగా తయారయిందని పేర్కొన్నారు. ఎంతో ప్రాధాన్యత కల్గిన స్వర్గపురి నిర్వహణ ఘోరంగా తయారయిందని పేర్కొన్నారు. కనీసంగా బాడీలను తగలబెట్టే ఎలక్ట్రికల్ క్రిమిటోరియం వద్ద పని చేయడానికి కార్మికులు లేరని, ఒక వేళా ఒకరు, అర ఉన్నా కానీ ఆ కార్మికులకు విఎంసి పైసా కూడా డబ్బులు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. స్వర్గపురి కాపలాకు కనీసంగా వాచ్ మెన్ లేడన్నారు. దీనిలో గ్రీనరీని మేకలు ధ్వంసం చేస్తున్నా పట్టించుకునే నాధుడే లేరని అన్నారు. స్వర్గపురి పక్కనే పందులు, కుక్కలు స్వేర విహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని పేర్కొన్నారు. మంచినీటి సరఫరా కూడా చాలీ చాలని రీతిలో ఉందని, కలుషిత నీరు సరఫరా అవుతుందన్నారు. ఇప్పటికయినా శానిటేషన్ మెరుగుదలకు కార్మికుల సంఖ్యను పెంచడంతో పాటు పర్యవేక్షణ నిత్యం ఉండాలని కోరారు. లేనట్లయితే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.తాండవకృష్ణ, కాయలకుమారి, వాజా శ్రీనివాసరావు, బత్తుల తవిటమ్మ తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ నూరు వసంతాల వేడుకలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట



సిపిఐ నూరు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం కోదాడ రోడ్డులోని డిపో సెంటర్‌లో ఉన్న పిల్లలమర్రి భవన్లో వేడుకలను నిర్వహించారు. తొలుత పార్టీ కార్యాలయంలో సీనియర్ కమ్యూనిస్టు నాయకులు భోగ్యం నాగులు సిపిఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. జగ్గయ్యపేట నియోజకవర్గ మొట్టమొదటి శాసనసభ్యులు పిల్లలమర్రి వెంకటేశ్వర్లు కాంస్య విగ్రహానికి పార్టీ కార్యాలయం ముందు ఉన్న డివైడర్‌పై శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ కార్యదర్శి అంబోజీ శివాజీ, మండల కార్యదర్శి మెటికల శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'గ్రేటర్ విజయవాడ'ను నెరవేర్చాలి : జాస్తి

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ నగర ప్రజల స్వప్నంగా తయారయిన గ్రేటర్ విజయవాడ ప్రతిపాదన పట్ల సిఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించడం ఎంతో అభినందనీయమని టిడిపి సీనియర్ కార్పొరేటర్ జాస్తిసాంబశివరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ...విజయవాడ సమగ్రాభివృద్ధికి గ్రేట్ విజయవాడ చేస్తే బాగుంటుందని విజయాడ యం.పి కేశినేని శివనాద్ (చిన్ని), ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌రావు స్వయంగా సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడం, దీనిపై సిఎం కూడా సానుకూలంగా స్పందించడం జరిగిందని అన్నారు. విజయవాడకు చుట్టుపక్కల ఉన్న 75 గ్రామాలను కలుపుతూ అమరావతి రాజధానికి ధీటుగా విజయవాడను అభివృద్ధి చేయాల్సి ఉందనే దిశగా యంపి, ఎమ్మెల్యేలు ఉన్నారన్నారు. గ్రేటర్ విజయవాడలో... నగరానికి మౌలిక వనరులైన ఫ్లైఓవర్లు, వంతెనలు, లింక్ రోడ్డు, ఇళ్ల నిర్మాణాలు పూర్తి స్థాయిలో జరుగుతాయని పేర్కొన్నారు. నగర ప్రజల కోరిక అయిన గ్రేట్ విజయవాడను త్వరలోనే కార్యరూపం దాల్చే దిశగా సిఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నామన్నారు.

శివాలయం హుండీల లెక్కింపు

ప్రజాశక్తి - పెదకాకాని


స్థానిక మల్లేశ్వరస్వామి వారి దేవస్థానములో శుక్రవారం కానుకల హుండీలను తెరిచి లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ ఉప ఎమిషనర్, కార్యనిర్వహణాధికారి గోగినేని లీలాకుమార్ మాట్లాడుతూ గడిచిన 71 రోజుల కానుకల హుండీల ద్వారా రూ.64,18,291, అన్నదానం హుండీ ద్వారా రూ.7,80,953, బంగారం 0.043.190మి.గ్రా, వెండి 0.364.200 గ్రాములు, 3 ఆమెరికన్ డాలర్సు హుండీ ద్వారా ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

పలుచోట్ల రంగా వర్ధంతి

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగాకు ప్రజల హృదయాల్లో చెక్కు చెదరని స్థానం ఉందని జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను అన్నారు. శుక్రవారం విద్యాధరపురం సితార, విఎం రంగా చౌక్ సెంటర్లో 44, 45 డివిజన్ల కార్పొరేటర్లు మైలవరపు రత్నకుమారి, మైలవరపు మాధురి లావణ్య, టీడీపీ నేతలు మైలవరపు కృష్ణ, మైలవరపు దుర్గారావు ఆధ్వర్యంలో మోహన రంగా వర్ధంతి నిర్వహించారు. రంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, కార్పొరేటర్లు మహదేవు అప్పాజీరావు, బుల్ల విజయ్‌కుమార్, గుడివాడ నరేంద్ర, మరుపిళ్ల రాజేష్, అత్తలూరి పెద్దబాబు, ఉమ్మడి చంటి తదితరులు పాల్గొన్నారు. 37వ డివిజన్‌లో అల్లాడి మురళి నాయకత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఉత్తమ్ చంద్ భండారి, పేర్ల హరి ప్రసాద్ పాల్గొన్నారు. పోతిన వెంకట మహేష్ ఆధ్వర్యంలో సితార సెంటర్‌లో రంగా వర్ధంతి నిర్వహించారు. **కంచికచర్ల:** రాధా రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ సెంటర్‌లోని రంగా విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు, వైసిపి పట్టణ అధ్యక్షుడు, ఉపసర్పంచ్ వేమా సురేష్‌బాబు, మాజీ సొసైటీ చైర్పర్సన్ కాలువ పెద్దబాబు, రాష్ట్ర వైసిపి జాయింట్ సెక్రటరీ కాలువ వాసుదేవరావు, మాజీ సర్పంచ్ దేవిరెడ్డి శివరాధకుమారి నివాళులర్పించారు. కాపు సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు పుల్లగూర ప్రభాకర్‌రావు, నాయకులు దాసరి రాము పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. **మైలవరం:** స్థానిక మదర్ థెరిసా విగ్రహం వద్ద ఉన్న రంగా విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చంద్రగూడెంలోని రంగా విగ్రహానికి జనసేన పార్టీ మండల అధ్యక్షులు బ్రహ్మయ్య తదితరులు నివాళులర్పించారు. **ఇబ్రహీంపట్నం:** కొండపల్లి మునిసిపాలిటీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన్ రంగా వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బొర్రా కిరణ్, చిలుకూరు సర్పంచ్ గొంది సురేష్, అక్కల ప్రసాద్, రాగాల రాము పాల్గొన్నారు. జనసేన నేత చెరుకుమల్లి సురేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జి అక్కల గాంధీ, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీను, యర్రంశెట్టి నాని, నగీనా, గొల్లపూడి మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు బసవ ఉమామహేశ్వరరావు, చెరుకుమల్లి రాధికా, కరిమి కొండ బాలాజీ పాల్గొన్నారు. **గంపలగూడెం:** తోటమూలలో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన రంగా వర్ధంతి కార్యక్రమంలో మండల అధ్యక్షులు చింతలపాటి వెంకటకృష్ణ, సర్పంచ్ చెన్న శ్రీనివాసరావు పాల్గొన్నారు. **తిరువూరు:** తిరువూరులో కాంగ్రెస్ పార్టీ, రాధా రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. జైబావి సెంటర్‌లో రంగా విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పల్లెపాటి శ్రీనివాసరావు, కృష్ణమోహనరావు తదితరులు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు.. రాధారంగా మిత్రమండలి సభ్యులు రంగారావు, రాంబాబు, పూర్ణచంద్ర రావు, రవిచంద్ర తదితరులు రంగా విగ్రహం వద్ద నివాళులర్పించా రు. **జగ్గయ్యపేట:** పట్టణంలోని మోహన్ రంగ విగ్రహానికి పట్టణ మున్సిపల్ 5వ వార్డ్ కౌన్సిలర్ వట్టెం మనోహర్, శ్రీకృష్ణదేవరాయ సేవాసమితి ప్రతినిధులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ హాస్పిటల్ లోని పేషంట్లకు పండ్లు, బాలింతలకు బ్రెడ్లు పంపిణీ చేశారు. పేద మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి గౌరవ అధ్యక్షులు గోగుశెట్టి వెంకట మహేష్, అధ్యక్షులు కామిశెట్టి అమర్నాథ్ పాల్గొన్నారు. రంగ విగ్రహానికి స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముందుగా పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నుండి యువ నాయకులు శ్రీరాం చిన్నబాబు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

నందిగామ: గాంధీ సెంటర్‌లో అన్నదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావు, వైసిపి నాయకులు, మస్తాన్, రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు.


జగ్గయ్యపేటలో...


విజయవాడలో...

వంగవీటి మోహనరంగాకు నివాళి

కృష్ణాజిల్లా వ్యాప్తంగా మాజీ ఎంఎల్ఎ వంగవీటి మోహన రంగా 37 వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.


ప్రజాశక్తి-చల్లపల్లి : జనసేన పార్టీ ఆధ్వర్యంలో చల్లపల్లిలో స్థానిక పడమర వీధిలోని వంగవీటి మోహన రంగా విగ్రహానికి ఘంటసాల ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, జనసేన పార్టీ టౌన్ ప్రెసిడెంట్, పిఏసిఎస్ చైర్మన్ బొందలపాటి వీరబాబు తదితరులు పూలమా లలు వేసి ఘన నివాళు లర్పించారు. టిడిపి నాయకులు రావిరాజేశ్వరరావు, న్యాయవాది తుటారం ప్రసాద్, గోళ్ళ ప్రసాద్ పాల్గొన్నారు.


వంగవీటి రంగ ఆశయ సాధనకు కృషి : మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి - కలక్టరేట్ (కృష్ణా) : పేదల జీవితాల్లో వెలుగులు నింపినపుడే.. వంగవీటి రంగాకు అసలైన నివాళి అని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నంలోని కోనేరు సెంటర్ నుండి భారీ బైక్ ర్యాలీ నిర్వహించి రేవతి సెంటర్లో ఏర్పాటు చేసిన వంగవీటి రంగ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వంగవీటి రాధా రంగా మిత్రమండలి అధ్యక్షులు రాయగిరి శ్రీరామ్ మోహన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ , తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు** : రంగా వర్ధంతి పురస్కరించుకుని ఉయ్యూరు పలుప్రాంతాల్లో ఆయన విగ్రహాలకు, ఏఎంసీ కార్యాలయ ఆవరణ లో చిత్రపటానికి కూటమి నాయకులతో కలసి ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్ కుమార్ పూలమాలలువేసి ఘనంగా నివాళు లర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్** : మోహన రంగా ఆశయాల సాధనకు కృషి చేస్తున్నట్లు జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో కన్వీనర్ వికృతి శ్రీనివాస్ అలియాస్ కొరియర్ శీను పేర్కొన్నారు. శుక్రవారం బల్లిపర్రు గ్రామంలో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు దుప్పట్ల పంపిణీ చేశారు. కూటమి నాయకులు బత్తిన రమేష్ , యర్రంశెట్టి వీరబాబు, బావిరెడ్డి రవి, వీరకుమార్ స్వామి పాల్గొన్నారు.**ప్రజాశక్తి - గుడివాడ** : గుడివాడ జనసేన నేత సందు పవన్ కార్యాలయంలో వంగవీటి మోహన్ రంగా వర్ధంతి ఘనంగా నిర్వహించారు. తొలుత రంగా వర్ధంతి సందర్భంగా పట్టణ పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలను జనసేన నాయకులు అందించారు. గుడివాడ పట్టణ జనసేన నాయకులు గాడి కిరణ్, సయ్యద్ నజీర్, కొల్లూరి కిరణ్, గెడ్డం శ్రీను, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఏజెకె ఎదురుగా ఉన్న రంగా విగ్రహానికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, సందు పవన్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక రాజేంద్రనగర్‌లోని వైకాపా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను, నాయకులు పాలేటి చంటి, ఎంవి నారాయణరెడ్డి, అద్దేపల్లి పురుషోత్తం, పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ** : అవనిగడ్డలోని టిడిపి ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్లో నిర్వహించిన కార్యక్రమంలో రంగా చిత్రపటానికి నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్ రామ్, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా30 మంది గ్రామపంచా యతీ పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు అందజేశారు. అదేవిధంగా వైసీపీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, ఆయన తనయుడు సింహాద్రి వికాస్ బాబు రంగా చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనా రాయణ, ఎంపీపీ తుంగల సుమతీదేవి, కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షులు నరహరిశెట్టి శ్రీమన్నారాయణ, కోడూరు మండల పార్టీ అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటేశ్వరరావు పూలదండలు వేసి నివాళులర్పించారు. చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత, రాధా రంగా మిత్రమండలి దివి యూనిట్ అధ్యక్షులు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో ఆరో వార్డులోని రంగ, దామెర్ల చిన్నబ్బాయి విగ్రహాలకు పూల దండలు వేసి నివాళు లర్పించారు. టిడిపి జిల్లా కార్యదర్శి అవనిగడ్డ ప్రకాశం, టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరం ఆదినారా యణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : గుడ్లవల్లేరు మండలంలో రంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాయి విద్యానికేతన్ అధినేత శింగంశెట్టి ఆదినారాయణ (చినమాస్టారు), వైఎస్సార్ సీపీ మండల యువజన అధ్యక్షుడు గుదే రవి, పార్టీ జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి మిరియాల బాబు రాజేంద్రప్రసాద్, గుడివాడ నియోజకవర్గ ఐటీ అధ్యక్షుడు కుందేటి ఫణి తదితరులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-పామర్రు** : స్థానిక వైఎస్ఆర్సిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ రంగా చిత్రపటానికి నివాళులర్పించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు తాడిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని తోటలో ఉన్న రంగా విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా నివాళులర్పించారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల** : పమిడిముక్కల మండలంలోని మంటాడ గ్రామంలో వంగవీటి మోహనరంగా విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. మంటాడ ఎంపీటీసీ మెరుగు లక్ష్మి, వైసిపి నాయకులు ముళ్లపూడి నాగార్జున, కనుమూరి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపిపి గంజాల సీతారామయ్య, తిరుమలశెట్టి బోసు బాబు పాల్గొన్నారు **ప్రజాశక్తి-కంకిపాడు** : కంకిపాడు గవర్నమెంట్ హాస్పిటల్‌లో వంగవీటి మోహన్ రంగా వర్ధంతి సందర్భంగా రక్తదానం శిబిరంను ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ప్రారంభించారు. కంకిపాడు సెంటర్లోని రంగా విగ్రహానికి కు టీడీపీ యువనేత బోడే వెంకట్రామ్, జనసేన నేతలు,వేర్వేరు గా పూలమాలలు వేసి నివాళులర్పించారు.


బందరులో...


గుడివాడలో...


అవనిగడ్డలో...


బందరులో...



వెయ్యిమందికి అన్నదానం

ప్రజాశక్తి- తాడేపల్లి : వంగవీటి మోహనరంగా వర్ధంతి సందర్భంగా శుక్రవారం తాడేపల్లి మహానాడు వద్ద రాధా రంగా మిత్రమండలి, ప్రజా కాపునాడు ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా 37 వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెయ్యి మందికి అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో వంగవీటి మోహన రంగా తనయుడు వంగవీటి రాధా ముఖ్య అతిథులుగా పాల్గొని రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత గుంటూరు పార్లమెంటు ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్,జనసేన పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు అంబటి తిరుపతిరావు, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు టంకశాల ఈశ్వర్ నాయుడు,జంగాల సాంబశివరావు,రాధా రంగా మిత్రమండలి,ప్రజా కాపునాడు నాయకులు, జొన్నా రాజేష్, తోట సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



388వ రోజుకు దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి : చట్ట ప్రకారం తమకు రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శుక్రవారం నాటికి 388వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సిఐటియూ పట్టణ కార్యదర్శి వి.దుర్గారావు, కార్మికుల యూనియన్ నాయకుడు స్టీవెన్, ఆదినారాయణ, వై.సాంబశివరావు, అంకయ్య ప్రారంభించారు. దీక్షల్లో దేరంగుల రమణమ్మ, మొలక శారదా, వేము రిబ్కా, వేముల లక్ష్మి, జి. అన్నమ్మ కూర్చున్నారు.

బస్సు షెల్టర్ నిర్మించాలని సంతకాల సేకరణ

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి పట్టణంలోని శ్రీలక్ష్మి నరసింహ స్వామి కాలనీ బస్ స్టాప్ వద్ద షెల్టర్ నిర్మించాలని కోరుతూ సిపిఎం 22వ వార్డు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సంతకాలు సేకరించారు. బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. సమస్యను పరిష్కరించాలని మంగళగిరి తాడేపల్లి నగరపాల సంస్థ కార్పొరేషన్ కమిషనర్, స్థానిక సచివాలయ అడ్మిన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు పంపినట్లుగా సిపిఎం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు పి.బాలకృష్ణ, జె.శివ భావన్నారాయణ, బి.స్వామినాథ్, జి.గోపాలకృష్ణ పాల్గొన్నారు.


సంతకాలు సేకరిస్తున్న దృశ్యం

సమ్మె కాలపు వేతనాలను వెంటనే చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి- తాడేపల్లి : గత సమ్మెకాలకు ఒప్పందాల ప్రకారం వేతనాలను మున్సిపల్ కార్మికులకువెంటనే చెల్లించాలని సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రాజధాని ముఖ ద్వారమైన ఉండవల్లిలో కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందరరేగా ఎం రవి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత సంవత్సరం డిసెంబర్ 26న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెబాట పట్టిన నేపథ్యంలో ప్రభుత్వం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని, సమ్మె కాలానికి వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చి నేటికి సంవత్సరం పూర్తయిన ఇచ్చిన హామీని ఇప్పటివరకు అమలు చేయలేదని అగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, మున్సిపల్ మంత్రి ,అధికారులు ఇచ్చిన హామీ మేరకు వెంటనే మున్సిపల్, ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె కాలపువేతన బకాయిలను కార్మికుల అకౌంట్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మున్సిపల్ కార్మికుల సమ్మెబాట పట్టిన నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను జీవోల రూపంలో విడుదల చేయాలని పలుమార్లు రాష్ట్ర వ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టిన నేపథ్యంలో జీవోలు ఇస్తామని హామీలు ఇచ్చారని అవి కూడా అమలు చేయలేదని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గత ఒప్పందాల కు వెంటనే జీవోలు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

విధి ఎంత విచిత్రం..

- నిన్న సన్మానం... నేడు శ్రద్ధాంజలి



ప్రజాశక్తి - మంగళగిరి : మనిషికి ఏ క్షణానికి ఏమవుతుందో ఎవరికి తెలియదు. 100వ సంవ త్సరంలోకి అడుగు పెట్టబో తున్న ఓ రిటైర్డ్ పాస్టర్‌ను క్రిస్మస్ పర్వదినాన ఘనంగా సత్కరించాడు ఓ నాయకుడు. తిరిగి మరుసటి రోజు ఆ పెద్దాయన ప్రభువు సన్నిధిలో నిద్రించాడు అనే చెదు వార్తతో అదే నాయకుడు శ్రద్ధాంజలి ఘటిస్తూ పూలమాలవేయటం చూస్తే విధి ఎంత విచిత్రంగా ఉంటుందనే భావన ప్రతి ఒక్కరి మదిలో మసులుతుంది. ఆ విషాద ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళగిరి మన్నెం వారి వీధిలో ఉంటున్న 99 సంవత్సరాలు వయసు ఉన్న రిటైర్డ్ పాస్టర్ ఆనంద రావును క్రిస్మస్ సందరరేగా గురువారం మధ్యాహ్నం స్థానిక మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మన్నెం రమేష్ బాబు ఘనంగా సత్కరించి నూతన వస్త్రాలు, పండ్లు అందజేశారు. సంతోషపడిన ఆనందరావు రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు.

గర్భాశయ కేన్సర్‌పై పోరాటానికి రోటరీ అడుగు

ప్రజాశక్తి మంగళగిరి : గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి బాలికలను రక్షించే ఉద్దేశంతో మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు ప్రెగడ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం వి.జె. జూనియర్ కాలేజి ఆవరణలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు.ప్రభుత్వ, మున్సిపల్, ఐడెడ్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదువుతున్న 9 నుంచి 14 సంవత్సరాల లోపు బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి రక్షణ కల్పించే క్వాడ్రివాలెంట్ హెచ్‌పీవీ టీకాను 2026 జనవరి 7న ఉచితంగా అందజేయ నున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సుమారు వెయ్యి మందికి పైగా బాలికలకు టీకా వేయనున్నట్లు పేర్కొన్నారు.ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రతి రెండు నిమిషాలకు ఒక మహిళ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన తెలిపారు. ఈ ప్రమాదకర వ్యాధి నివారణకు రెండు మోతాదులుగా హెచ్‌పీవీ టీకా తీసుకోవడం అత్యంత అవసరమని వివరించారు.ఈ కార్యక్రమాన్ని సుమారు రూ.50 లక్షల వ్యయంతో, తల్లిదండ్రుల అనుమతితో పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు .




ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిపి రాజశేఖరబాబు

కొండపల్లి దర్గా ఉత్సవాలకు భద్రతా ఏర్పాట్లు : సిపి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి హజరత్ సయ్యద్ షాబుఖారి బాబా దర్గా ఉరుసు మహోత్సవం ఈ నెల 29, 30, 31 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు శుక్రవారం పరిశీలించారు. మొబైల్ సహాయ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి నిఘా పటిష్టం చేస్తామని తెలిపారు. సీసీ కెమెరాలు, భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఉరుసు కమిటీ చైర్మన్ అల్తాఫ్ బాబా సూచనలతో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.

సమిష్టిగా లక్ష్యాన్ని చేరుకోవాలి : పవిత్రకుమార్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: అవకాశాలైనా, ఫలితాలైనా ప్రతిభతోనే రాబట్టాలని జె.ఎస్.డబ్ల్యు. ఫౌండేషన్ (ముంబయి) సీఈఓ పవిత్రకుమార్ అన్నారు. పి.బి. సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ పీజీ విభాగం (ఎంబిఎ) శుక్రవారం వెబినార్ హాలులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తాను సిద్ధార్థ పూర్వ విద్యార్థినని, టాటా ట్రస్టులో చీఫ్ ప్రోగ్రాం డైరెక్టర్‌గా తాను చేశానని, కార్పొరేట్ నుంచి సేవారంగంలోకి తన పయనం సాగిందన్నారు. ఎవరైనా జీవితంలో రాణించాలంటే తమను తాము నిరూపించుకోవాలన్నారు. సవాళ్లను స్వీకరించాలన్నారు. శ్రమపడే తత్వంతో సమష్టిగా లక్ష్యాలు ఛేదించాలని పిలుపునిచ్చారు. టాటా సన్స్ నుంచి టాటా ట్రస్టుకు డివిడెండ్ వచ్చేదని టాటా ట్రస్ట్ పక్షాన నీతి ఆయోగ్, గూగుల్ లలో తాను పనిచేశానని తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా పి.పవిత్రకుమార్ ను కళాశాల ప్రిన్సిపల్ డా. మేకా రమేష్, డీన్ ఆచార్య రాజేశ్ సి.జంపాల, డా . ఎం.డి.ఎస్ రహమాన్ సత్కరించారు.



పసుపులేటి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలో నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో వైసిపి రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి పసుపులేటి సత్య శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం నిర్వహించారు. నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రకృతి ఆరోగ్య కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు శాంతినగర్‌లో సిద్ధార్ధ ప్రకృతి ఆరోగ్య కేంద్రాన్ని మండల విద్యాశాఖ అధికారి, ఇన్‌ఛార్జ్ డివైఈఓ శ్యాంసుందర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కేంద్రంలో స్వల్ప, దీర్ఘకాలిక సమస్యలకు వైద్యాన్ని అందిస్తామని డాక్టర్ యల్విజి తెలిపారు. ప్రధానంగా సయాటికా సర్వైకల్ స్పాండిలోసిస్, మోకాళ్ల నొప్పులు, మైగ్రేన్, ఆస్తమా, ఆర్థరైటిస్, ఫ్రోజోన్ షోల్డర్, మూత్ర పిండాల సమస్య, మహిళా సమస్యలు, సెక్స్ బలహీనతలు తదితర సమస్యలకు చికిత్స చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటాచల ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రేపు కెబిఎన్ పూర్వ విద్యార్థుల సమావేశం

ప్రజాశక్తి-విజయవాడ సిటీ

కెబిఎన్ కళాశాల 60వ వార్షికోత్సవాల సందర్భంగా 28వ తేదీ పూర్వ విద్యార్థుల సమావేశం అత్యంత భారీగా నిర్వహించనున్నట్లు కెబిఎన్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది డి.పి.రామకృష్ణ చెప్పారు. శుక్రవారం వారం కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాల 1965లో ప్రారంభించారని, అప్పటి నుంచి వేలాది విద్యార్థులు ఈ కళాశాలలో చదివి, దేశవిదేశాల్లో అత్యున్నత స్థానాల్లో ఉన్నారని చెప్పారు. కళాశాల అధ్యాపకుల బోధన, ప్రోత్సాహం తమ విజయాలకు కారణమన్నారు. కళాశాల అభివద్ధికి పునరంకితం కావాలనే లక్ష్యంతో కెబిఎస్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ (కోసా) ఏర్పాటు చేసామన్నారు. 28వ తేదీ ఆదివారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించే పూర్వవిద్యార్థుల సమావేశానికి విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు. కోసా కార్యదర్శి జె.ఎన్.శ్రీనివాసు మాట్లాడుతూ ఛత్తీస్‌ఘడ్ ఛీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటివ్ ఆఫీసర్, ఐఎఫ్ఎస్ అధికారి చంద్రశేఖర్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఇందిరా కల్యాణ్, ఆదినన్నయ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రసన్నశ్రీ, 'సి' ఛానెల్ ఎమ్‌డి రమేష్, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసు, జబర్దస్త్ ఫేం సుడిగాలి సుధీర్, సినీ టీవీ రంగ ప్రముఖులు ఇంద్రనీల్, సుహాస్ తమ పూర్వ విద్యార్థులని, వీరంతా ఈ సమావేశానికి హాజరువున్నారని చెప్పారు. ఈ సమావేశంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ టి.శ్రీనివాసు, హిందూ హైస్కూల్స్ కమిటీ పరిపాలనాధికారి డాక్టర్ వి.నారాయణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, కోసా ట్రెజరర్ ఎన్.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ డి.హేమచంద్రరావు పాల్గొన్నారు.



న్యాయ విధుల బహిష్కరణ

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ లో న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరణ చేశారు. న్యాయ వ్యవస్థను పరిరక్షించే న్యాయవాదులపై పోలీసులు చేస్తున్న దౌర్జన్యాల పట్ల రాష్ట్ర బార్ ఫెడరేషన్ పిలుపుమేరకు నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నంద్రు బాబు విద్యాసాగర్ అధ్యక్షతన శుక్రవారం కోర్టు వీధులను న్యాయవాదులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ చిప్పగిరి ఎస్సై, పత్తికొండ ఎస్సై మరీ కొంతమంది పోలీసులు పత్తికొండకోర్టు హాలు లో ఒక కేసులో సరెండర్ పిటిషన్ ఫైల్ చేసిన వ్యక్తిని కోర్టు హాలు నుండి దౌర్జన్యం చేయటం హేయమైన చర్య అన్నారు. న్యాయవాదులపై దౌర్జన్యం చేసి పోలీస్ స్టేషన్ లో కూర్చోబెట్టి భయభ్రాంతులకు గురిచేసిన సంఘటన తీవ్రమైన అంశంగా పరిగణించాలన్నారు. న్యాయవాదులు పట్ల దౌర్జన్యం చేసి,న్యాయవాదులు హక్కులకు భంగం కలిగించిన సదరు ఎస్ఐలు విజయ్ కుమార్, సతీష్ కుమార్,పోలీసులు పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోర్టు పరిధిలో కోర్టు అనుమతి లేకుండా కూడా పోలీసులు దౌర్జన్యాలు చేస్తున్నారని, పోలీసులపై కోర్టు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ ప్రధాన కార్యదర్శి అద్దంకి మణిబాబు, ఉపాధ్యక్షులు వరదబోయిన విజయ్ కుమార్, ట్రెజరర్ మాడుగుల స్టాలిన్ బాబు, సీనియర్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ చావలి సాంబశివరావు, కౌన్సిల్ నెంబర్ తాడేపల్లి కాంతారావు, వేల్పుల కిషోర్, సీనియర్ న్యాయవాదులు మన్నెం నారాయణరావు, దాసరి వెంకట్రావు, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, షేక్ సైదా, ఎక్కిరాల హనుమంతరావు, గోబేరు శివరామకష్ణ, గుర్రాల వెంకటరత్నం, గింజుపల్లి రమేష్, వేల్పుల ప్రభాకర్, బలుసు పాటి సురేష్, ప్రభు జి తదితరులు పాల్గొన్నారు.



విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

శామ్‌సంగ్ ఎఐ గృహోపకరణాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్ : 2026కు సంబంధించి ఏ ఐ. గహోపకరణాలు మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు శాంసంగ్ సౌత్ వెస్ట్ ఏషియా ప్రెసిడెంట్, సీఈఓ జె.బి. పార్క్ అన్నారు. నగరంలోని ఓ హోటల్ ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాంసంగ్ ఏఐ అప్లయన్సెస్ మరో కీలక మలుపు తీసుకుంటున్నాయని తెలిపారు. వినియోగదారుల రోజువారీ జీవితాలను మరింత లోతుగా అర్థం చేసుకుంటూ, దైనందిన జీవన విలువను గణనీయంగా పెంచే విభిన్నమైన అనుభవాలను ఇవి అందిస్తున్నాయని తెలిపారు. ఈ తదుపరి దశను అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, ఐటీ ఎగ్జిబిషన్ అయిన సిఈఎస్ 2026లో ఆవిష్కరిస్తామని తెలిపారు. అలాగే జనవరి 4న జరిగే 'ది ఫస్ట్ లుక్' ఈవెంట్‌లో టీవీల విభాగంలోనూ కొత్త ప్రమాణాలను నెలకొల్పుతాని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు బైపాస్ పశువుల సంత వద్ద గురువా రం రాత్రి జాతీయ రహదారిపై లారీ బైక్ ఢీకొ న్న సంఘటనలో ఒక యువకుడు దుర్మరణం చెంద గా మరొక యువకుడు ప్రమాదకరమైన స్థితిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జల్ది కార్తీక్ (30), దేవరపల్లి సాయికిరణ్ లు బైక్ పై తెలంగాణ సరిహద్దు ముత్తగూడెం వైపు నుండి గురువారం రాత్రి 11 గంటల సమయంలో వస్తుండా ఎదురుగా వస్తు న్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదం కార్తీకు అక్కడి కక్కడే మతి చెందగా సాయి కిరణ్ కు తీవ్ర గాయాలవగా మెరుగైన వైద్యం కోసం విజయ వాడ తరలించారు. పరిస్థితి విషమంగానే ఉంది. మతుడు తిరువూరు పట్టణంలోని ఒక మొబైల్ షాపులో పనిచేస్తున్నాడు. కేసు నమోదుచేసిన ఎస్ఐ శాతకర్ణి పంచనామా నిర్వహించి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నేడు ఎ.కొండూరు మండల సమావేశం

ప్రజాశక్తి-ఎ.కొండూరు: ఎ.కొండూరు మండలం సర్వసభ్య సమావేశం 27వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో బి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీ 28వ వార్డులో ఏపీహెచ్ఎంఎల్ ఇతర రిటైర్డ్ ఎంప్లాయిస్ కమ్యూనిటీ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసుకున్న కాలనీకి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కొండపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు, కొండపల్లి జనసేన కొండపల్లి అధ్యక్షుడు చెరుకుపల్లి సురేష్, కోఆప్షన్ సభ్యులు యర్రంశెట్టి నానిలకు వినతిపత్రం అందజేశారు. 40 కుటుంబాలు గత పది సంవత్సరాల నుంచి ఉంటున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు వెంకటేశ్వరరావు, పరమేశ్వరరావు, మల్లేశ్వరరావు, మల్లేశ్వరయ్య, బాబావలి, సిఐటియు మండల కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.



విజయవాడలో కేటీఎం 160 డ్యూక్ టెస్ట్ రైడ్



ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: నంబర్ వన్ ప్రీమియం మోటార్‌సైకిల్ గా పేరుగాంచిన రేసింగ్ బైక్ బ్రాండ్ అయిన కేటీఎం 160 డ్యూక్ బైక్ టెస్ట్ రైడ్ చేసే అవకాశాన్ని విజయవాడ నగర వాసులకు కల్పిస్తున్నట్టుబజాజ్ ఆటో లిమిటెడ్ ప్రొ బైకింగ్ హెడ్ మానిక్ నాంగియా తెలిపారు. ఈ మేరకు తాము తాజాగా రూపొందించిన కెటిఎమ్ ఆరెంజ్ ఎక్స్ పీ - 160 ను తమ రైడింగ్ నిపుణుల పర్యవేక్షణలో విజయవాడ లోనిఆసక్తి కలవారు ఎవరైనా ఇది కేటీఎం 160 డ్యూక్ ను నడిపి చూడవచ్చని చెప్పారు.రైడింగ్ ప్రియులు అనుభవించడానికి ప్రత్యేకంగా రూపొందించబడిన, ట్రాక్ ఫస్ట్ అనుభవం. ఈ మోటార్ సైకిల్‌ను అనుభూతి చెందడానికి ఒక నవ మార్గంగా రూపొందించబడిన ఆరెంజ్ ఎక్స్ పి - 160 కేటీఎం నిపుణుల మార్గదర్శకత్వంలో ఎవరైనా సరే 160 డ్యూక్ బైక్‌ను సరైన ట్రాక్‌పై టెస్ట్ రైడ్ చేయడానికి వీలు కల్పిస్తుందన్నారు.ఈ కార్యక్రమం పుణెలో నవంబర్ 29, 2025న ప్రారంభమైందని, భారతదేశం అంతటా 40 కి పైగా పట్టణాలకు విస్తరించనుందన్నారు. ఇది మీ నగరానికి రేపు విజయవాడ వస్తుంది. ఇది దేశంలో కేటీఎం చేపట్టిన అతిపెద్ద అనుభవపూర్వక కార్యక్రమాలలో ఒకటిగా నిలవనుందన్నారు. ముఖ్య నగరాల్లోని గో కార్ట్ ట్రాక్‌లపై నిర్వహించబడుతున్న ఆరెంజ్ ఎక్స్ పీ -160, కేటీఎం 160 డ్యూక్ తన అత్యుత్తమ పనితీరును కనబరిచే ట్రాక్‌పైనే బైక్‌ను ప్రదర్శిస్తుందన్నారు. ఇది రైడర్‌లకు సురక్షితమైన, నియంత్రిత మరియు లీనమయ్యే 'రైడ్ & లెర్న్' వాతావరణాన్ని అందిస్తుందని, సాధారణ రోడ్లపై ఎన్నడూ తెలుసుకోలేని విధంగా రేసింగ్ మోటార్‌సైకిల్ యొక్క అంతర్గత నిర్మాణాన్ని ఇది తెలియజేస్తుందన్నారు.స్వచ్ఛమైన కేటీఎం ఇంజనీరింగ్ తోకేటీఎం 160 డ్యూక్ తేలికపాటి 164.2 సిసి సింగిల్ సిలిండర్, లిక్విడ్-కూల్డ్ ఇంజిన్ తో పనిచేస్తుందన్నారు. ఇది క్లాస్ లీడింగ్ అయిన 19 పీ ఎస్ శక్తిని మరియు 15.5 ఎన్ ఎం టార్క్‌ను అందిస్తుందని, 160 ప్లాట్‌ఫారమ్ స్వచ్ఛమైన పనితీరు ఇంజనీరింగ్‌పై కేటీఎం యొక్క ముఖ్య దష్టిని కొనసాగిస్తుందన్నారు. కొనుగోలు చేసే మొదటి మోటార్‌సైకిల్ అయినా లేదా అప్‌గ్రేడ్ అయినా, డ్యూక్ 160 అనేది తప్పక అనుభూతి చెందవలసిన అనుభవం అని, ఇందులో ఇప్పుడు 160సిసి నుండి 400సిసి వరకు నాలుగు మోటార్‌సైకిళ్ల ఉన్నాయని తెలిపారు.